
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

7

శుక్రవారం 7 మార్చి 2025



రైతుల కోసం.. రైతుల పేరిట ఏర్పాటు చేసిన సహకార సంఘాలు అక్రమాలకు నెలవుగా మారాయి. సాంకేతిక పరిజ్ఞానంతో ఇక నుంచి అక్రమాలకు ఆస్కారం లేకుండా.. రుణాల విషయంలో పారదర్శక పద్ధతి అవలంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల సహకార వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్నది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పీఏసీఎస్‌లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టి అవి పునరావృతం కాకుండా డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో దాదాపు 95 శాతం ఖాతాలను ఆన్‌లైన్‌చేశారు. సొసైటీలలో జరిగే అవకతవకలకు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్డుకట్ట పడనుందని తద్వారా పీఏసీఎస్‌ల బలోపేతానికి కంప్యూటరీ కరణ ద్వారా ప్రభుత్వం తొలి అడుగు వేసినట్లయింది.

● సొసైటీల్లో కొలిక్కివచ్చిన కంప్యూటరీకరణ

సహకారం.. సాంకేతికం

● ఏప్రిల్ నుంచి పీఏసీఎస్‌ల్లో డిజిటల్ లావాదేవీలు



● ఆన్‌లైన్‌తో డీసీసీబీ శాఖల్లో అవకతవకలకు అడ్డుకట్ట

● అన్నివిధాలుగా సొసైటీలను కునారిల్లేలా చేసిన గత ప్రభుత్వం

● సహకార వ్యవస్థను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తోన్న కూటమి ప్రభుత్వం

గతంలో అక్రమాలకు సహకారం

ఐదేళ్ల వైసీపీ హయాంలో పీఏసీ ఎస్‌లను అన్ని విధాలుగా కునారిల్లేలా చేసింది. ప్రతిఏటా సొసైటీల్లో ప్రవేశపెట్టే ఆడిట్ నివేదికలను కూడా తొక్కిపట్టి పెద్దఎత్తున అక్రమాలకు తెరతీసింది. అర్హత లేని ఎంతోమందికి రాజకీయ పరపతి ద్వారా సొసై టీల్లో ఉన్న సొమ్ములను దోచిపెట్టింది. త్రీమెన్ కమి టీల పేరిట ఐదేళ్ల పాటు ఓ ప్రహసనాన్ని నడిపింది. సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసే ప్రక్రియలో కూడా ముడుపుల పర్వానికి తెరతీసి అర్హత కలిగిన ఎంతోమందికి వేదనను మిగిల్చింది.


నేడు కూటమి బలోపేతం

డీసీసీబీ శాఖల్లోని ఖాతాలను ఆన్‌లైన్ చేయడంతో పాటు సొసైటీలు సొంతంగా నిలదొక్కుకునే విధంగా కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఆయా సహకార సంఘాల ద్వారా ఇతర వ్యాపారాల కోసం ఆసక్తి ఉన్న వారికి డీసీసీబీ ద్వారా రుణాలు ఇప్పించి వాటిని బలోపేతం చేసి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల కోసం ఖర్చు పెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం చేసింది. మొత్తంగా చూస్తే పీఏసీఎస్‌లకు జవసత్వాలు కల్పించడం ద్వారా సహకార సొసైటీల వ్యవస్థ సుదీర్ఘ కాలం రైతులకి సేవలందిస్తూ ఉండాలని, అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాంకేతిక సహకారంతో సహకార వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇంతకాలం సహకార వ్యవస్థ అక్రమాలతో నిండిపోగా పాలకవర్గాలు, ఉద్యోగుల అవినీతితో రైతులకు అందాల్సిన రుణాలు పక్కదారి పట్టాయి. దీనికితోడు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్ణయాలతో మొత్తం వ్యవస్థే గాడి తప్పింది. దీంతో కూటమి ప్రభుత్వం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ల్లోని ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్ చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. తద్వారా సంబంధిత లావాదేవీల్లో జరిగిన లొసుగులు బయటపడడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. ఇది చేపట్టి ఇప్పటికే నాలుగు నెలలు గడుస్తుండగా ఖాతాల కంప్యూటరీకరణ కొలిక్కి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డీసీసీబీ పరిధిలో 167 పీఏసీఎస్‌లు ఉన్నాయి. బాపట్ల జిల్లాకు వచ్చేసరికి ఈ సంఖ్య 112గా ఉంది. ఇందులో గుంటూరులోని డీసీసీబీ పరిధిలో 44 పీఏసీఎస్‌లు ఉండగా, ఒంగోలులోని డీసీసీబీ కింద 68 సహకార సొసైటీలు ఉన్నాయి. వీటికి సంబంధించి దాదాపు 95 శాతం ఖాతాల ప్రక్రియ ఆన్‌లైన్ పూర్తయింది. ఉమ్మడి గుంటూరు పరిధిలోని పీఏసీఎస్‌లలో 90 శాతం ఖాతాల డిజిటలైజేషన్ కొలిక్కి రాగా ఈ నెల పదిహేను కల్లా వందశాతం ఖాతాల ఆన్‌లైన్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ప్రభుత్వం మొత్తం డిజిటలైజేషన్ దాని ద్వారానే చేపడుతోంది. ఏప్రిల్ నుంచి లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయని తద్వారా రోజువారీ ప్రగతి నివేదికలు తెలుసుకోవడానికి (మిగతా 10వ పేజీలో)





పల్నాడు ప్రథమం

లక్ష్యం కంటే అధికంగా సీసీఆర్ కార్డుల పంపిణీ

కొద్దిగా వెనకబడిన గుంటూరు, బాపట్ల జిల్లాలు

ఈ-క్రాప్, వ్యవసాయ రుణాలకు మార్గం సుగమం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కష్టాలు తీరిపోతున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, వ్యవసాయ రుణాలు పొందేందుకు ఇంతకాలం అవస్థలు పడిన కౌలు రైతులకు మేలు చేసేలా క్రాప్ కల్టివేటర్ రైట్స్(సీసీఆర్) కార్డుల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే ఈ కార్డుల మంజూరులో పల్నాడు జిల్లా లక్ష్యాలను అధిగమించింది. కేటాయించిన లక్ష్యం కంటే అధికంగా పంపిణీ చేసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడు ప్రథమస్థానంలో నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ లక్ష్యాన్ని 10 జిల్లాలు అధిగమించగా అందులో పల్నాడు జిల్లా ఒకటిగా నిలవడం విశేషం. మరోవైపు గుంటూరు, బాపట్ల జిల్లాలు కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇవ్వడంలో కొంత వెనకబడ్డాయి. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని అధిగమించాలని ప్రభుత్వం రెండు జిల్లాల అధికారులను ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పల్నాడు జిల్లాలో 65 వేల మంది కౌలురైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా 65,126 కార్డులు మంజూరు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధికారులు అధిగమించారు. మరోవైపు గుంటూరు జిల్లాకు 46,670 సీసీఆర్ కార్డులు లక్ష్యం ఇవ్వగా 39,424 కార్డులు మంజూరు చేసి 84 శాతం పురోగతిని నమోదు చేయగలిగింది. బాపట్ల జిల్లాకు గుంటూరు, పల్నాడు కంటే అధిక లక్ష్యాన్ని ప్రభుత్వం ఇచ్చింది. ఈ జిల్లాలో 1,06,670 కార్డులు వ్యవసాయ సీజన్‌లో మంజూరు చేయాల్సిందిగా లక్ష్యం కేటాయించగా 88,219 కార్డులు మంజూరు చేసి 83 శాతం పురోగతిని సాధించింది. ప్రస్తుతం రబీ సీజన్ కూడా ముగింపు దశకు చేరుకున్నది. ఈ నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ సీజన్‌కి అయినా ఎక్కువ సంఖ్యలో సీసీఆర్ కార్డులు మంజూరు చేయాల్సిన బాధ్యత ఆయా జిల్లా యంత్రాంగాలపై ఉన్నది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ రుణాల పంపిణీ మొదలు అవుతుంది. ఈ దృష్ట్యా ఇప్పటి నుంచే వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

త్వరలో కౌలు రైతుల కోసం చట్టం..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో చాలావరకు కౌలు రైతులే పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వీరికి ఎలాంటి నష్టపరిహారం అందడం లేదు. మరోవైపు పంటలు సాగుకి బ్యాంకర్ల నుంచి రుణాలు కూడా పొందలేని పరిస్థితి. ఇందుకు కారణం భూమికి సంబంధించిన హక్కులన్నీ సంబంధిత యజమాని ఆధీనంలోనే ఉంటాయి. తాను పంట వేయకపోయినా బ్యాంకుల నుంచి రుణం తీసుకోగలుగుతాడు. అలానే ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు అధికారుల వద్ద ఉన్న డేటాలో యజమాని పేరే ఉంటుంది కాబట్టి ఆయనే నష్టపరిహారం పొందుతున్నాడు. కౌలురైతుల కోసం గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా అవి వారికి అక్కరకు రాలేదు. కూటమి ప్రభుత్వం కౌలురైతుల చట్టాన్ని సవరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. త్వరలోనే కొత్త చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది.

❖ పాస్టర్ జాషువా మోజెస్ ❖ లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం

❖ లక్షలాదిగా వచ్చిన దైవజనులు, విశ్వాసులు

10 లో



దయాక్షేత్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అమెరికాకు చెందిన ఫాస్టర్ ఎర్నిస్ట్ పాల్

ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ



అమరావతి మండలం లేమల్లె గ్రామంలో ప్రారంభమైన హోసన్న గుడారాల పండుగలో పాల్గొన్న విశ్వాసులు

❖ కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో ఐదేళ్ల నిర్లక్ష్యానికి తెర

❖ మిగిలిన బ్రిడ్జి నిర్మాణానికి నిధులిచ్చేందుకు కేంద్రం అంగీకారం

❖ రాష్ట్రం వాటా రూ.36.91 కోట్లు చెల్లింపునకు ఓకే చెప్పిన రైల్వేమంత్రి

నందివెలుగు.. ఆర్వోబీకి మోక్షం



నందివెలుగు ఆర్వోబీ వద్ద పెమ్మసాని.. నసీర్ (ఫైల్ ఫొటో)

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నందివెలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)కి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్వోబీకి పట్టిన గ్రహణం వీడి పనులు ప్రారంభానికి మార్గం సుగమమైంది. కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ నందివెలుగు ఆర్వోబీకి కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో సఫలీకృతులయ్యారు. ఆర్వోబీ పూర్తి చేయడానికి కావాల్సిన రూ.36.91 కోట్లు ఇచ్చేందుకు కేంద్రాన్ని ఆయన ఒప్పించారు. దీంతో ఐదేళ్ల క్రితం ఆగిపోయిన ఆర్వోబీ నిర్మాణానికి మోక్షం లభించింది.

2017లో మొదలు.. 2019 నుంచి గ్రహణం

గుంటూరు నుంచి నందివెలుగు మీదగా తెనాలికి వెళ్లే రోడ్డులోని హనుమాన్‌పాలెం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్‌పాలెం వద్ద 850 మీటర్ల పొడవున ఎల్‌.సీ. నెం 249 ఆర్వోబీ నిర్మాణానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2017లో మొదలైన ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 2019 నాటికి పూర్తి చేసేలా అప్పట్లో ఒప్పందాలు జరిగాయి. కానీ ఆ ప్రాజెక్టు నిర్మాణ కాలపరిమితి పెరుగుతూ వచ్చింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు రూ.8 కోట్లు చెల్లించలేదు. దీంతో కేంద్రం కూడా వంతెన నిర్మాణాన్ని ఆపేసింది. అప్పటికే రైల్వే శాఖ రూ.6.18 కోట్లు, అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.10.82 కోట్లు ఖర్చు చేసి చేపట్టిన పనులతో బ్రిడ్జి నిర్మాణం మొండి గోడలకే పరిమితమైంది.

ఎన్నికల సమయంలో పెమ్మసాని హామీ

సాధారణ ఎన్నికలకు ముందు 2023లో జరిగిన రెండురోజుల బస్సు యాత్రలో టీడీపీ ముఖ్య నాయకులు నందివెలుగు ఆర్వోబీ వద్ద జగన్ ప్రభుత్వానికి సెల్ఫీ చాలెంజ్ విసిరారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచార సమయంలో గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి, ప్రస్తుత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే నసీర్ నందివెలుగు ఆర్వోబీని పరిశీలించి నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కిందటేడాది జూలై 24న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు పెమ్మసాని లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే నందివెలుగు ఆర్వోబీ మిగిలిన నిర్మాణానికి కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు ఇచ్చేందుకు అంగీకరించింది. జనవరిలో పలకలూరు- పేరేచర్ల ఆర్వోబీకి రూ.41 కోట్లు ఇచ్చిన కేంద్రం, 40 రోజుల వ్యవధిలోనే నందివెలుగు ఆర్వోబీకి రూ.36.91 కోట్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దీంతో నందివెలుగు ఆర్వోబీ నిర్మాణానికి మోక్షం లభించింది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (శుక్రవారం)
సహారి : 5.05 (శనివారం)

ముగిసిన లాటరీ

13 మద్యం దుకాణాలు కేటాయింపు



లాటరీ నిర్వహిస్తున్న జేసీ భార్గవ్ తేజ, ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గౌడ, గౌడ్ సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని గీత కులాలకు 13 మద్యం దుకాణాలు కేటాయించగా జేసీ భార్గవ్‌తేజ, ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా అధికారి అరుణకుమారిల సమక్షంలో లాటరీ ప్రక్రియ జరిగింది. కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో లాటరీ నిర్వహించి లైసెన్సుదారులను ఎంపిక చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించి అరగంటలోనే ముగించారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే ప్రక్రియను బహిరంగంగా నిర్వహించారు. పారదర్శకంగా లాటరీ తీసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఎస్ మారయ్యబాబు, ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే జరగాలి

◆ తప్పులు లేని భూ రికార్డులు రూపొందించాలి

◆ మందపాడు గ్రామంలో క్షేత్రస్థాయిలో కలెక్టర్ తనిఖీ

మేడికొండూరు, గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం యజమానుల సమ క్షంలో భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలె క్టర్ నాగలక్ష్మి తెలిపారు. మందపాడు గ్రామంలో పంట పొలాల రీ సర్వేను గురువారం క్షేత్రస్థా యిలో కలెక్టర్ తనిఖీ చేశారు. రీ సర్వే పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. తప్పులకు అవకాశం లేకుండా భూ రికార్డులు రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ రికార్డులలో యజమానుల వివరాలను, పేర్లు అక్షర దోషాలు లేకుండా నమోదు సమయంలోనే అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వీఆర్వో లాగిన్ స్థాయిలోని అన్ని వివరాలను రెవెన్యూ అధికారులు తనిఖీ చేయాలన్నారు. గ్రామంలో దేవదాయ శాఖ భూముల్లో నివాస స్థలాలు ఉన్న ప్రాంతం మినహా మిగతా ప్రాంతం ఆక్రమణలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం దేవదాయశాఖ స్థలంలో ఉంటున్న నివాసితుల రికార్డులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.



మందపాడులో భూ సర్వే వివరాలను పరిశీలించి సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

◆ సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలను, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న సర్వేల క్షేత్ర పరిశీలన కలెక్టర్ పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

◆ గుంటూరు నగరపాలక సంస్థ 79వ సచివాలయం పరిధిలోని లక్ష్మీనగర్‌లో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ, వర్క్ ఫ్రం హోం, సిటిజన్ మ్యాపింగ్ మిస్సింగ్ సర్వేలను కలెక్టర్ పరిశీలించారు. సర్వే యాప్‌లో నివాసితుల వివరాలను సచివాలయ ఉద్యోగులు నమోదు చేస్తున్న విధానాన్ని గమనించారు. ప్రజలు సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వేలకు సహకరించాలన్నారు. శనివారానికి సర్వేలన్నీ నూరు శాతం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఇంటర్మీడియట్ ఆర్‌ఐవో జుబేర్, ల్యాండ్ రికార్డ్స్ సర్వే ఏడీ పవన్‌కుమార్, మేడికొండూరు, గుంటూరు పశ్చిమ తహసీల్దార్లు హరిబాబు, వెంకటేశ్వర్లు, సర్వే ఇన్‌స్పెక్టర్ కిశోర్‌బాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, సర్వేయర్ సాంబశివరావు, ఈవో విజయభాస్కర్‌రెడ్డి, డీఎల్‌డీవో పిచ్చిరెడ్డి, సచివాలయ సెక్రటరి శ్రీనివాసులు, కోఆర్డినేటర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు 10

పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో నిందితుడి మృతి 8

ఎన్జీ రంగా వర్సిటీలో వైసీపీ రాజ్యం! 13

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

తాడికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.జోగారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిపోయిన ఖాళీ సీట్లలో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు వెల్లడించారు. అదే రోజు ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు స్టాండింగ్ కమిటీల సమావేశం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సాధారణ సర్వ సభ్య సమావేశం ఆరంభం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వార్షిక బడ్జెట్ పై చర్చ జరగనుంది.

కలెక్టర్‌కు సరెండర్ చేసి నెల దాటినా ఇంకా విధుల్లోనే..

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు కలెక్టర్ అరుణ్‌బాబుకు జనవరి 20వ తేదీన సరెండర్ చేస్తూ బాలకృష్ణను రిలీవ్ చేశారు. ఈ సంఘటన జరిగి నెలరోజులు దాటినప్పటికీ సీనియర్ అసిస్టెంట్ కార్యాలయంలో ఆర్ఐ పాత్ర పోషిస్తూ నిబంధనలకు విరుద్ధంగా తన పనులు చేసుకుపోతున్నాడు. కార్యాలయం నుంచి రిలీవ్ కాలేదు. సీనియర్ అసిస్టెంట్ పదవీ కాలం రెండు సంవత్సరాలు పూర్తి కాకుండా ఆర్ఐ విధులు నిర్వహించకూడదని నిబంధనలు ఉన్నాయి. అయినా ఫ్యామిలీ మెంబరు ధ్రువీకరణ పత్రాలను వీఆర్వోలతో సంబంధం లేకుండా తానే అర్జీదారులను కార్యాలయానికి పిలుచుకుని విచారణ జరిపి తహసీల్దార్ ముందు ఉంచుతున్నారు. దానిని తహసీల్దార్ మంజూరు చేస్తున్నారు. అయితే సరెండర్ చేసిన తహసీల్దార్ మాచవరంకు ఇన్‌చార్జిగా వెళ్లడంతో ఇక్కడ తహసీల్దార్‌గా డానియేలును నియమించారు. నాగమల్లేశ్వరరావు మాచవరం వెళ్లినప్పటి నుంచి సీనియర్ అసిస్టెంట్ ఆర్ఐగా తన విధులు నిర్వహిస్తున్నాడు. కలెక్టర్‌కు సరెండర్ చేసి రిలీవ్ చేసినప్పటికీ హాజరులో సంతకం చేస్తున్నాడు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త బైపాస్‌లో సోలార్ కేబుల్ చోరీ

నాదెండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం, నాదెండ్ల గ్రామాల పరిధిలో కొత్తగా నిర్మించిన బైపాస్‌లో ఏర్పాటు చేసిన సోలార్ కేబుల్‌ను అపహరించారు. ఈ విషయ షైవీ స్పార్కిల్ ఎండీ కల్లూరు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గణపవరం గ్రామ పరిధిలోని కొత్త బైపాస్‌లో సుమారు 10వేల మీటర్ల కేబుల్ చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. కేబుల్‌లోని కాపర్ కోసం ఈ చోరీకి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేబుల్ విలువ సుమారు 2.20 లక్షలు ఉంటుందని వివరించారు.

బోధనలో సమూల మార్పులు

- సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పోకడలు
- వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సాంకేతిక యుగంలో బోధనా పద్ధతులు రూపాంతరం చెందుతున్నాయని ఏఎన్యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ పర్స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ బోధన పద్ధతులు నిరంతరం మారుతూనే ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది బోధన ఎక్కడ నుంచైనా వినే అవకాశం కలిగిందన్నారు. కరోనా తరువాత ఇటువంటి అవకాశాలు పుష్కలంగా రూపాంతరం చెందినట్లు వివరించారు. విద్యార్థి అనుకున్న రీతిలో బోధన పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. నేటి తరాన్ని తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు కూడా నూతన నైపుణ్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యా విభాగం ఆచార్య వనజ మాట్లాడుతూ ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీనిని పసిగట్టాలంటే తప్పనిసరిగా విద్యావంతులు కనీస విద్య అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంచుకుంటున్నారని వివరించారు. జపాన్ దేశం 2017లోనే విద్య విధానంలో 5.0 విధానంలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నశీలమణి మాట్లాడుతూ నాణ్యమైన బోధనకు అర్హత గల అధ్యాపకులు న్యాయం చేస్తారని సూచించారు. సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఈడీ, ఎంఈడీ కోర్సుల్లో కొత్త మార్పులు వస్తాయన్నారు. సదస్సుకు 80 పరిశోధన పత్రాలు వచ్చాయని, వాటిని పుస్తక రూపంలో తీసుకువచ్చినట్లు వివరించారు. ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య మాట్లాడుతూ అభివృద్ధికి విద్య అనేది మొదటి అడుగుగా అభివర్ణించారు. సదస్సుకు కన్వీనర్లుగా డాక్టర్ ఎం. వసంతరావు, డాక్టర్ రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ సందీప్ వ్యవహరించారు. సదస్సులో దేశంలోని పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ అధ్యాపకులు ప్రొఫెసర్స్ కె.సుమలత, వి.రవి, పి.ఆడం పాల్, టి.షారోన్ రాజు, ఈ. అశోక్ కుమార్, టి.ఇస్మాయిల్, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందిగం, కొల్లా వివాహ మహోత్సవం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- పలువురు ప్రముఖుల హాజరు

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో శివశక్తి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతుల కుమారుడు సునీల్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త కొల్లా శ్రీమన్నారాయణ, మాధవి దంపతుల కుమార్తె నూతన వివాహ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు (గురజాల) నక్కా ఆనందబాబు (వేమూరు), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల), ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఎస్‌పీఎఫ్ ఐజీ త్రివిక్రమవర్మ, శ్రీరామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వైస్ చైర్మన్ ఆర్ దుర్వాసన్, హైదరాబాద్ రెరా డిప్యూటీ డైరెక్టర్ (టెక్నికల్) నాదెండ్ల తిరుపతయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పంచుమర్తి భూపతిరావు, ఈడే మురళీకృష్ణ, పలువురు ప్రముఖులు ఆశీర్వదించారు.

మంగళాద్రిలో వైభవంగా ధ్వజారోహణం

- సకల దేవతలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనృసింహస్వామి

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో కీలక ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను, భక్తజనులను ఆహ్వానించేందుకు శ్రీస్వామివారి సేవకుడైన గరుత్మంతుని పంపిస్తూ గరుడ ధ్వజాన్ని ఆవిష్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీనిప్రకారం గరుత్మంతుని చిత్రం ముద్రించిన పతాకాన్ని గరుడ ధ్వజంగా ధ్వజ స్తంభానికి ఆవిష్కరిస్తూ ధ్వజారోహణం గావించారు. ఋత్విగ్వరణ, అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అర్చక స్వాములు ఈ ఉత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టనాగాధిపతియైన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దల పేరుతో భక్తులకు పంపిణీ చేశారు. సంతానం లేని మహిళలు ఈ ప్రసాదాన్ని స్వీకరించినట్టయితే వారికి శీఘ్రగతిన సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా గరుడ ముద్దలను స్వీకరించేందుకు పలువురు మహిళలు ధ్వజారోహణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఈ ఉత్సవానికి మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ధ్వజారోహణ ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో నియమ నిష్ఠలతో నిర్వహించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడ ముద్దలను ప్రసాదంగా స్వీకరిస్తున్న మహిళలు

నేటి నుంచి వాహన సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ప్రధాన వాహన సేవలు ఆరంభం కానున్నాయి. తొలిరోజు స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తారు. 8న రాజాధిరాజ వాహనం, 9న ఉదయం ముత్యాల పల్లకీ వాహనం, రాత్రి యాలి వాహనం, 10న ఉదయం చిన్న శేష వాహనం, అదేరోజు రాత్రి సింహ వాహనం, 11న ఉదయం హంస వాహనం, అదేరోజు రాత్రి గజ వాహనం, 12న ఉదయం కల్పవృక్ష వాహనం, అదేరోజు రాత్రి పొన్న వాహన సేవ, 13న ఉదయం అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు. అదేరోజు అర్ధరాత్రి స్వామివార్ల కల్యాణం జరుగుతుంది.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మే 18 నుంచి 20 వరకు గుంటూరులో జరగనున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ నాగబ్రహ్మాచారి, సీపీడీసీఎల్ అధ్యక్షుడు దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సీఐటీయూ నగర కార్యాలయంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకునేందుకు రాష్ట్ర మహాసభల్లో కీలకమైన నిర్ణయాలు చేసేందుకు వేదిక కానున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బి. లక్ష్మణరావు, నాయకులు సుబ్బారెడ్డి, రాం ప్రభాకర్, చెన్నకేశవులు, చంద్రశేఖర్ ఆచారి, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): డిపాజిట్ దారులు, చిట్టీ పా టదారుల నుంచి సుమారు రూ. 400 కోట్ల మేరకు వసూలు చేసి మోసం చేసినట్లు నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో దాఖలైన కేసులో చిట్‌ఫండ్స్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో శుక్రవారం వాదనలు జరగనున్నాయి.. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి మొదటి పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు నిందితులుగా ఉన్నారు. పుల్లారావుపై గుంటూరులో మరో కేసు నమోదు అవ్వడంతో సదర కేసులో గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మొదటి పట్టణ పోలీసులు పుల్లారావును పీటీ వారెంట్‌పై స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పోలీసు కస్టడీకి అడుగుతూ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం పిటిషన్ పెండింగ్‌లో ఉంది.

ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి దోపిడీ

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికుడిగా ఎక్కి విచక్షణా రహితంగా దాడి చేసి డబ్బు దోచికెళ్లిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సీఎం కాలనీకి చెందిన తుమ్మపూడి అశోక్ కుమార్ గుడివాడలో డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు ఆటోలో వెళుతున్నాడు. మార్గమధ్యలో కఠెవరం గేట్లు దాటిన తరువాత జనసంచారంలేని ప్రాంతంలో ఓ వ్యక్తి ఆటోలో ఎక్కించుకోవాలని ఆపాడు. ఆటోలో ఎక్కి బండి కదిలిన వెంటనే వెనుక మెడపై పదునైన వస్తువుతో విచక్షణారహితంగా దాడి చేసి అశోక్ కుమార్ వద్ద ఉన్న రూ.11000 తీసుకుని పరారయ్యాడు. మెడ, చేతుల భాగంలో తీవ్ర గాయాలతో బాధితుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆటోలో తెనాలి చేరుకున్నాడు. గాయాలతో ఉన్న బాధితుడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షలు జరిపి చికిత్స అందిస్తున్నారు.

బ్లేడుతో కుటుంబ సభ్యులపై దాడి

చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రజక కాలనీకి చెందిన జి.మణికుమార్ దుర్వసనాలకు బానిసై మద్యం తాగడానికి అడిగిన డబ్బులు రూ.30 వేలు ఇవ్వలేదని కుటుంబ సభ్యులతో సహా నలుగురిని దారుణంగా బ్లేడుతో కోసి గాయపరిచిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. గాయపడిన వారిలో కుటుంబ సభ్యులు అయిన తండ్రి కృష్ణారావు, పిన్ని రాజేశ్వరి, అక్క నాగలక్ష్మి, మరో వ్యక్తి హరీష్ ఉన్నారు. పోలీసులకు సమాచారం తెలియడంతో అర్బన్ సీఐ పి.రమేష్, ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు జగన్‌కు లేదు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాని వ్యక్తికి హామీలపై ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన అబద్ధాలు, మోసాలు, హత్యా రాజకీయాలతో ముఖ్యమంత్రి పదవి దక్కించుకొని, 5 ఏళ్ల రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. తమ జీవితాలకు సున్నా చుట్టాడనే జగన్‌కు, వైసీపీకి జనం సున్నం బొట్లు పెట్టి మరీ సాగనంపారని అన్నారు. యువతను, నిరుద్యోగుల్ని తానే ఉద్ధరించినట్లు జగన్ మాట్లాడటం హాస్యాస్పదం అని చెప్పారు. 40 లక్షల ఉద్యోగాలు ఇస్తే వైసీపీ పట్టభద్ర ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో జగన్ చెప్పాలని అన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ, ప్రజలకిచ్చిన ప్రతి హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందని వివరించారు. ఎన్నికల ప్రచారంలో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిలో ఎన్ని అమలు చేశారో ప్రజల్లోకి వచ్చి జగన్ చెప్పగలడా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా పరదాల చాటున, ఇప్పుడేమో నాలుగు గోడల మధ్యన, అదే జగన్‌కు తెలిసిన పాలన అని చెప్పారు.

అహంకార ధోరణి వీడలేదు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమతో మాట్లాడుతున్నారని, అహంకార ధోరణి వీడలేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉండగా అవినీతి, అక్రమాలు చేయడమే కాకుండా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌ను, వారి కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబును అక్రమ అరెస్టు చేయడం వలన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దించి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. 11 సీట్లకే పరిమితం చేసినా జగన్మోహన్‌రెడ్డిలో మార్పు లేదని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. తల్లిని, చెల్లిని గౌరవించలేని వ్యక్తి, ఎదుటి వ్యక్తులను ఎలా గౌరవిస్తారనేది అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. జగన్ లాంటి వ్యక్తులను రాజకీయాల నుంచి కాదనీ, సమాజం నుంచే వెలివేయాలని యరపతినేని మండిపడ్డారు.

మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులు



విశాలాక్షికి బహుమతి అందజేస్తున్న బుడితి రాజశేఖర్, శారదా జయలక్ష్మి

గుంటూరు సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అన్నారు. లాం ఫామ్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో గురువారం జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి డీన్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, మహిళా రక్షణ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎ.మణి అధ్యక్షత వహించారు. ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ద్వారా మహిళల జీవితంలో పెను మార్పులు సంభవించాయని అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారిని సన్మానించడంతో పాటు, మహిళా రైతులను సన్మానించడం గొప్ప భాగ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారని తెలిపారు. అనంతరం ఆయా జిల్లాలకు చెందిన మహిళా రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో మృతి

నరసరావుపేట లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవటానికి ఓ లాడ్జిలోని మేడపై బాత్రూంలో ఏర్పాటు చేసిన వెంటిలేటర్ కిటికీ నుంచి కిందకు దూకి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్సై అశోక్ బాబు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ మారేడుమిల్లిలోని తుకారాం గేట్‌కు చెందిన రాములు నాయక్ పై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 22 కేసులు పెండింగ్ ఉన్నాయి. గత నెలలో నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దేవాలయంలో చోరీ కేసులో నాయక్ నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుకు సంబంధించి బుధవారం అతని భార్యతో కలిసి పట్టణంలోని కోర్టుకు వాయిదా నిమిత్తం వచ్చాడు. రాములు నాయక్ గుంటూరు జిల్లా పత్తిపాడు పరిధిలోని ఓ దేవాలయంలో కూడా చోరీకి పాల్పడినట్లు నిర్ధారించుకున్న గుంటూరు సీసీఎస్ పోలీసులు రాములు ఆచూకీ తెలుసుకొని అదుపులోకి తీసుకున్నారు. రాములు నాయక్‌కు విరోచనాలు అవుతుండడంతో అతని భార్య అభ్యర్థన మేరకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగల లాడ్జిలో బాత్రూమ్‌కు రాములు వెళ్లాడు. బాత్రూం తలుపులు వేసుకొని వెంటిలేషన్ ఫ్యాన్‌ను తీసివేసి ఆ రంధ్రం నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న నరసరావుపేట రెండో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 525.80 అడుగులు ఉంది. ఇది 160.06 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8541 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,644 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,19,950 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,16,671 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,19,950 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,938 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	11500	12800
334	9500	13800	బ్యాడిగి 355	10500	13800
నంబరు. 5	10000	13500	సింజెంటా		
273	--	--	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14500	ఎన్ఎస్ 250		
4884	10000	11000	బుల్లెట్	--	--
సూపర్ 10	--	--	దేవనూరు డీలక్స్	10000	13300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఆర్మూరు	10000	11300
తేజ	10500	14000	తాలుకాయలు	5000	7500

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

● ఎమ్మెల్యే గల్లా మాధవి



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న బాధిత కుటుంబాలతో ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక నేరాలకు పాల్పడిన మోసగాళ్ల విషయంలో విచారణ వేగంగా చేసి బాధితులందరికీ సత్వర న్యాయం జరిగేలా చూడాలని గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గురువారం జీరో అవర్‌లో 'ఆర్థిక నేరాల' అంశాన్ని లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల ఉన్నత విద్య, వివాహాలు తదితర అవసరాల కోసం తమ డబ్బును చిట్టీలు, స్కీంల రూపంలో పెట్టి మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారన్నారు. దానివలన ప్రజలు ఆర్థికంగా నష్ట పోవటమే కాకుండా, కొన్నిసార్లు బలవన్మరణానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్రంలో కొన్ని చిట్‌ఫండ్ కంపెనీలు బోర్డు తిప్పేయడం, చేబదులుగా రుణం తీసుకొని ఐపీ పెట్టటం, రైతుల పంట కొనుగోలు చేసి డబ్బు చెల్లించకుండా వ్యాపారులు ఉడాయించటం లాంటి ఘటనలు సర్వసాధారణం అయ్యాయన్నారు. దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆర్థిక నేరాల కేసులను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. నేరగాళ్ల ఆస్తులను జప్తు చేసి బాధితులకు భరోసానివ్వాలన్నారు. దీనిపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి కోరారు.

● సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన మొత్తం రూ.9,22,256 చెక్కులను ఎమ్మెల్యే మాధవి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందించారు.

ఎన్నారై కళాశాలలో నేటి నుంచి టెక్నికల్ ఫెస్ట్

మేడికొండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం విశదల అడ్డరోడ్డులోని ఎన్నారై కళాశాలలో సరితం(టెక్నో, స్పోర్ట్స్ కల్చరల్ ఫెస్ట్) 2కె25 టెక్నో ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమవుతుందని ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు మంచు మనోజ్, కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.శరత్ హాజరుకానున్నారు. సరితం 2కె25 టెక్నో ఫెస్ట్ పేరుతో రెండురోజుల పాటు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9వరకు జరిగే కార్యక్రమాలకు అందరిని ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు వివరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

అబాకస్‌లో భారతీయ విద్యాభవన్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామచంద్రరాజు తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ విద్యార్థి మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల కార్యదర్శి పి.రామచంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కె.కార్తికేయ ప్రథమ బహుమతి, 5వ తరగతి విద్యార్థి జి.కిషోర్‌కుమార్ కన్సొలేషన్ బహుమతి సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కోశాధికారి కె.రామ్‌సుభాష్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం కృష్ణ ఉషశ్రీ అభినందించారు.

ట్రాఫిక్ బారికేడ్లు అందజేత



బారికేడ్లను పోలీసులకు అందజేస్తున్న అద్విక్ బొల్లినేని

గుంటూరు, మెడికల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కాకానిరోడ్డులోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ వారు 200 ట్రాఫిక్ బారికేడ్లను గురువారం గుంటూరు ట్రాఫిక్ పోలీసులకు అందజేశారు. కిమ్స్ హాస్పిటల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అద్విక్ బొల్లినేని, హాస్పిటల్ సీవోవో సుధాకర్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ట్రాఫిక్ సీఐ అశోక్‌లకు బారికేడ్లను అందజేశారు. మల్టీ స్పెషాలిటీ కేర్‌హాస్పిటల్‌గా సేవలు అందిస్తున్న కిమ్స్ శిఖర హాస్పిటల్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అద్విక్ తెలిపారు. డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు.

'ఛలో పిఠాపురం' పోస్టర్ల ఆవిష్కరణ

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని చిత్రాడలో ఈ నెల 14న జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని 18వ డివిజన్ జనసేన కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ కోరారు. ఈమేరకు గురువారం శ్రీనివాసరావుతోట ఆరో లైన్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఛలో పిఠాపురం పోస్టర్లను వెంటకరమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు మామిడి రామారావు, సోమి ఉదయ్, దళవాయి సుబ్రహ్మణ్యం, యర్రగోపుల జయదీప్, డొంకెన మురళీ, బిట్రగుంట శ్రీనివాసరావు, సయ్యద్ షర్ఫుద్దీన్, డేగల వెంకటేశ్వరరావు, తోట కార్తీక్, బండారు రవీంద్ర, అడపా శ్రీనివాసరావు, దాసరి అప్పారావు, ఇర్రి సాయి, లక్ష్మీశెట్టి నాని పాల్గొన్నారు.

గడువు లోపు భూసేకరణను పూర్తిచేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



ఆర్‌వోబీ నిర్మాణదారులతో సమావేశమైన కలెక్టర్, కమిషనర్

గుంటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని నిర్ణీత వ్యవధిలో సేకరించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లో బ్రిడ్జి నిర్మాణంలో భాగస్వామ్యం కానున్న ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు హాజరయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణే కీలకమైనదన్నారు. ప్రైవేటు భవనాల యజమానుల నుంచి భూమిని భూసేకరణ చట్టం ప్రకారం సేకరించాలరు. ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మాణానికి శుక్రవారం టెండర్‌ను విడుదల చేస్తారన్నారు. ఏప్రిల్ 15 నాటికి టెండర్‌ను ఫైనలైజ్ చేసి మే మొదటి వారంలో సంబంధిత ఏజెన్సీ ద్వారా నిర్మాణపనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. మే నెలాఖరుకు సైట్ క్లియరెన్స్ పనులన్నీ పూర్తిచేసి ఫ్లై ఓవర్ నిర్మాణపనులు చేపట్టేందుకు అన్ని చర్యలు పూర్తి చేయాలని స్టేక్ హోల్డర్లు అయిన టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్, నగరపాలక సంస్థ, పోలీస్, రైల్వే, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, జీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగమహేశ్వరరావు, డిప్యూటీ సిటీప్లానర్ సూరజ్ కుమార్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరాజు, సీఐ అశోక్‌కుమార్, సిటీప్లానర్ రాంబాబు, బీఎస్ఎన్ఎల్ కరుణాకర్, ఎల్‌డీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుదాం !

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడానికి నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గురువారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, నోడల్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశం ఆయన మాట్లాడారు. నగరంలో తప్పనిసరిగా డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణ పక్కాగా జరిగేలా సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇళ్లల్లో హోం కంపోస్ట్ తయారుచేసేలా నగరవాసులకు శిక్షణ ఇవ్వాలన్నారు. శివారు ప్రాంతాల్లో చెరువుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆఫీస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

నగరంలోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పనులు ప్రారంభం దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా హిందూ కాలేజీ జంక్షన్ నుంచి నగరంపాలెం, పట్టాభిపురం మెయిన్ రోడ్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల వరకు రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను ఈ నెల 11వ తేదీ నుంచి తొలగింపు చేపడతామని, ఆక్రమణదారులు 10వ తేదీలోపు స్వచ్ఛందంగా తొలగించుకొని జీఎంసీకి సహకరించాలని కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 3 వంతెనల నుంచి శారదా కాలనీ, అమరావతి మార్గాల్లోనూ రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించనున్నామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదన సిద్ధం చేయాలి

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కమిషనర్ శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. గురువారం కమిషనర్ ఏటీ అగ్రహారం, నల్లకుంట, పట్నంబజార్, శ్రీనివాసరావు తోట, ఏటుకూరు, బొంతపాడు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రధాన, అంతర్గత రహదారుల్లో ప్యాచ్ వర్క్‌లను పూర్తిచేయాలని ఏఈలను ఆదేశించారు. అనంతరం నల్లచెరువు మెయిన్ రోడ్డులోని అన్నక్యాంటీన్‌ని పరిశీలించి, టిఫిన్ చేశారు. పర్యటనలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, డిఈఈలు మధుసూదన్, సతీష్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయాలను చక్కదిద్దాలి: ఎమ్మెల్యే నసీర్



శాసన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా మారిన సచివాలయ వ్యవస్థను చక్కదిద్దాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ సమావేశాల్లో గురువారం ఆయన సచివాలయ వ్యవస్థ గురించి ప్రస్తావించారు. సుమారు 1.20 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్న సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎలా జవాబుదారీగా ఉండాలనే విషయాన్ని సభాపతికి వివరించారు. ప్రస్తుత ఉద్యోగుల్లో కొందరికి మాత్రమే ఎక్కువగా పని ఉంటోందని, కొందరికి అసలు పనే లేకుండాపోయిందన్నారు. మహిళా పోలీసులు ఎక్కడ పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు.

జాతీయ భద్రతా దినోత్సవం



తులసీ సీడ్స్ ఫ్యాక్టరీలో ప్రసంగిస్తున్న ఎండీ తులసీ యోగీష్ తదితరులు

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఫిరంగిపురంలోని తులసీ సీడ్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగిష్ భద్రతా పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. సహజంగా కర్మాగారాలలో జరిగే ప్రమాదాలు ఎలా ఉంటాయి, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశంపై ఆయన కార్మికులకు ప్రదర్శన రూపంలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కోస్టల్ ప్యాకేజింగ్స్, చైతన్య ప్యాకేజింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, తులసీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రొడక్షన్ మేనేజర్స్, సిబ్బంది, కార్పొరేట్ హెచ్ఆర్ వడ్లమూడి రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతులు కల్పించి, రావలసిన బకాయిలను చెల్లించాలని నగర, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం కార్యాలయం ఎదుట నిరసన, అనంతరం డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేసే కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య నగరపాల సంస్థ, మండల అధికారులు సంబంధం లేని పనులను కేటాయిస్తున్నారని, దీంతో ఉద్యోగులు పనిభారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఈ అదనపు విధుల నుంచి ఆరోగ్య కార్యదర్శులను తొలగించాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుకుమార్, సూరి, రాజూనాయక్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న అంగన్‌వాడీల రాష్ట్ర ధర్నా

గుంటూరు(తూర్పు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల జీతాల పెంపుదల తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న విజయవాడలో జరిగే రాష్ట్ర ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు ఏవీఎన్ కుమారి పిలుపునిచ్చారు. గురు వారం పాత గుంటూరు, జిల్లా కార్యాలయంలో శ్రీవాసవి అధ్యక్షతన అంగన్‌వాడీల సమావేశం జరిగింది. తమ సమ్యలపై పలుమార్లు అధికారులు, మంత్రులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని, అందుకే ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు ఏం ఆదిలక్ష్మి, ఐ గౌతమి, వై రమణ తదితరులు ప్రసంగించారు.

ఇంట్లో భారీ చోరీ

● రూ. కోటి విలువైన బంగారం అపహరణ

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ 3వ లైనులో భారీ చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంటిలో కోటి ఖరీదైన బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదు అపహరణకు గురైంది. శానిటరీ సామగ్రి విక్రయించే దుకాణం కలిగిన సత్యనారాయణ గురువారం ఉదయం కుటుంబసభ్యులతో కల సి ఇంటికి తాళం వేసి ఊరువెళ్లారు. సాయంత్రం ఇంటికివచ్చి చూడగా చోరీ వ్యవహారం వెలుగుచూసింది. వేసిన తాళాలు వేసినట్లుగానే ఉండగా ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. నగలతో పాటు, రెండు లక్షల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

స్థానిక మారుతినగర్, మారుతి దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా అలివేలుమంగ శ్రీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం తూర్పు రాజగోపుర కలశాల స్థాపన చేశారు. మహాపూర్ణాహుతి జరిపి కలశ ఉద్వాసన, బలిహరణలు చేశారు.

జగన్ మానసిక స్థితి సరిలేదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మార్చి (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి లండన్ వెళ్ళొచ్చినప్పటి నుంచి ఆయన మానసిక స్థితి సరిగాలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో వినుకొండ పర్యటనలో, ఇటీవల మిర్చియార్డు పర్యటనలో జగన్ మాట్లాడిన తీరుకి వైసీపీ శ్రేణులే నిర్ఘాంత పోయారని ఎద్దేవా చేశారు. ఐదుగురిని లాగేస్తే చంద్రబాబు ప్రతిపక్షహోదా పోతుందని అసెంబ్లీ సాక్షిగా ఊగిపోయిన జగన్, ఇప్పుడు 11 సీట్లకే ప్రతిపక్ష హోదా ఇవ్వమని ప్రాధేయ పడడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పోటీ చేసిన 22 సీట్లలో గెలిచి ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కల్యాణ్‌ను కార్పొరేటర్‌కు ఎక్కువని జగన్ మాట్లాడడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనని మండిపడ్డారు. బాబు, లోకేశ్, పవన్‌లపై పేలిన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సీనియార్టీ జాబితాలో లోపాలను సవరించాలి

● ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులోని లోపాలను సవరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో రేణుకకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రకటించిన గుంటూరు-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టులో సీనియర్ ఉపాధ్యాయులు, వారి సర్వీసు, సీనియారిటీని పరిగణలోకి తీసుకోలేదని, వెంటనే సీనియారిటీ లిస్టులను సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, అధ్యక్షుడు సాయి విశ్వనాథ్, ప్రధానకార్యదర్శి పి.లలితబాబు, గౌరవ అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పత్రికలు ఆవిష్కరణ

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు సుద్దపల్లిడొంక రోడ్డులోని లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల 27వ కల్యాణ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. గురువారం మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణ బ్రహ్మోత్సవాలలో పాల్గొనాల్సిందిగా ఆలయ కమిటీ మంత్రికి విజ్ఞప్తి చేసింది.

బలవంతపు ఆన్‌లైన్ కొనుగోళ్లను ఆపివేయాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా' రూరల్ మహిళా ఉత్సవ్-2025' పేరుతో యానిమేటర్ల చేత డ్వాక్రా మహిళలతో బలవంతపు ఆన్‌లైన్ కొనుగోళ్ళను తక్షణమే ఆపివేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం వారు జరిగిన విలేకరులతో మాట్లాడుతూ గిన్నిస్ రికార్డు పొందాలనే ఆశతో యానిమేటర్లను అప్పులపాలు చేసే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ

గుంటూరు(విద్య), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళలకు బీసీ కార్పొరేషన్ ద్వారా టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ కె.మయూరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రహ్మణ, కాపు సామాజికవర్గాల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో మొత్తం 6,219మందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు. ఏపీ ఓబీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా కులం, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీవీఐటీ విద్యార్థినులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

పెదకాకాని, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విద్యార్థినులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపిల్లో వీవీఐటీ కళాశాలకు చెందిన 88 మంది ఉద్యోగాలు పొందారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియామకాలు పొందిన విద్యార్థినులకు సంస్థ రూ.3.6 లక్షల నుంచి రూ.9.5లక్షల వార్షిక వేతనం కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ప్లేస్మెంట్ డాక్టర్ ఎం.వి.రఘురామ్, ఉపాధికల్పనా, శిక్షణా విభాగాధిపతి డాక్టర్ మాధవ్ అభినందించారు.



ఉద్యోగ నియామకాలు పొందిన వీవీఐటీ విద్యార్థులు

జిల్లాను చెత్త రహితంగా తీర్చిదిద్దాలి

● జిల్లా పంచాయతీ అధికారి నాగసాయికుమార్



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్

గుంటూరు (తూర్పు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాను చెత్తను రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీపీవో బీ నాగసాయికుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురం, మల్లవరం, తురకపాలెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి గ్రామస్థులకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడిచెత్త వేరువేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వర్మీకంపోస్టు కేంద్రాలను ఆయన సందర్శించి పాలసముద్రం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు, క్లాప్‌మిత్రులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంతోనే కుటుంబానికి సౌభాగ్యం



ఎమ్మెల్యే గల్లా మాధవిని సన్మానిస్తున్న కూటమి పార్టీల మహిళా నేతలు

గుంటూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు సౌభాగ్యంగా ఉంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో జనసేన, బీజేపీ నేతలతో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7, 8 తేదీలలో టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్డీయే కూటమి మహిళా నేతలకు మెగా వైద్య శిబిరం నిర్వహించబోతున్నామని, ఈ వైద్య శిబిరంలో గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ సహా అన్ని వైద్యసేవలు అందిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల రమణ, బీజేపీ సుగుణ, జనసేన రమాదేవి, మామిడి రామారావు, కిషోర్, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశాంతి అభిషేకం



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న కమలానంద భారతీ స్వామి

గుంటూరు(తూర్పు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం ఆలయ శిఖరానికి విశేషపూజలతో కలశస్థాపన చేశారు. శ్రీపద్మావతి శ్రీగోదాదేవి శ్రీవేంకటేశ్వరస్వామికి మహాశాంతి అభిషేకం నిర్వహించారు. సభకు ఆలయకమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. కమలానంద భారతిస్వామి, పరమాత్మ నందగిరిస్వామి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీవేత్తలు నిష్ఠల సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, యాబలూరి లోకనాథశర్మలు ప్రసంగించారు. అతిథులుగా ఎమ్మెల్యే పి.పుల్లారావు, సీఐడీ డీఎస్పీ లక్ష్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూరు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీనారాయణపురం, శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామివారి 79వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సుప్రభాతం, ఆరాధన, పూర్ణాహుతి తదితర సేవలను నిర్వహించారు. సాయంత్రం చతుస్థానార్చన, పూర్ణాహుతి జరిగాయి. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు సీతారామానుజాచార్యస్వామి, అనంత సత్యధర్మాచార్యస్వామి పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి దేవాలయ 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత గోపూజ, గణపతి పూజ, కలశస్థాపన, నవగ్రహారాధన జరిగాయి. అనంతరం సిద్ధిబుద్ధి సమేత గణపతిస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మాట్లాడుతూ 16వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు.

ఎకోటూరిజం.. ఎంజాయ్ చేద్దాం!


బాపట్ల మండలం సూర్యలంక తీరానికి సమీపంలో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన ఎకోటూరిజం ప్రధానద్వారం

● పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు
● మరింత అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
● నిధులు రాగానే అధునాతన సౌకర్యాలు


ఎకో టూరిజంలోని పర్యాటకులు తిరిగేందుకు ఏర్పాటుచేసిన సైకిళ్ళు


డార్మిటరీలోని బెడ్‌లు

బాపట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్ర తీరంలో ఎకోటూరిజంను అత్యంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కాటేజీల చుట్టూ 45 రకాల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో కూడా చల్లటి వాతావరణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ కాటేజీలలో సరదాగా గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎకోటూరిజంనకు ఆ తర్వాత వైసీపీ పాలనలో ఆదరణ కరవైంది. దీని అభివృద్ధిని గాలికి వదిలేశారు. మొక్కుబడిగా నిర్వహిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై మళ్లీ దృష్టిసారించింది. ఎకోటూరిజంలో 6 కాటేజీలు, ఒక డార్మేటరి, రెస్టారెంట్, వాటర్‌ప్లాంట్ ఉన్నాయి. ప్రస్తుతం మరో 6 కాటేజీలు అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్నారు. వీటితో మొత్తం 12 కాటేజీలు ఒక డార్మేటరి ఉంటాయి. జీడిమామిడి తోటల మధ్య 45 రకాల చెట్లు, మొక్కల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉన్న కాటేజీలలో సేద తీరేందుకు దూరప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొని పర్యాటకులు వస్తున్నారు. సూర్యలంక నేచర్ క్యాంపు రిసార్ట్‌గా ఏర్పాటు చేసిన ఎకోటూరిజంలో బీచ్ సఫారి, సైకిల్ సఫారి సదుపాయం కల్పించారు.

కాటేజీల ధరలు ఇలా..

సూర్యలంక తీరంలోని ఎకోటూరిజం కాటేజీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 9గంటల వరకు ఒకరోజుగా పరిగణిస్తారు. సోమవారం నుంచి గురువారం వరకు కాటేజీకి రూ. 3,265 చెల్లించాలి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు రూ. 3,592 చెల్లించాలి. డార్మేటరిలో 6 బెడ్‌లు ఉంటాయి. దీనికి రూ.4,816 చెల్లించాలి. ఎక్స్‌ట్రా బెడ్‌కు విడి రోజుల్లో రూ. 998, వీకెండ్‌లో రూ. 1098 చెల్లించాలి. చిన్నచిన్న ఫంక్షన్లు, పార్టీలు, ఫొటోషూట్‌లు తీసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

సముద్రానికి కొంత దూరంగా ఎకోటూరిజం ఉండటం వల్ల పర్యాటకుల ఆదరణ తక్కువగానే ఉంది. సముద్రం ఎదురుగా ఉండే కాటేజీలకే ఆదరణ ఎక్కువగా ఉంది. అయితే ఇక్కడపచ్చటి మొక్కలు, చెట్లు, ఆహ్లాదాన్ని పంచేవిధంగా ఉన్నాయి. ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రకృతి మధ్య ఉండాలనుకునేవారు ఎక్కువగా ఇక్కడకు వస్తుంటారు. సముద్రాన్ని సందర్శించిన తర్వాత ఇక్కడకు వచ్చి మంచి నీటితో స్నానాలు చేసి సేద తీరే అవకాశం ఉంది. కనుక ప్రభుత్వం దీనిని మరింతగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేస్తుంది.

టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు చేశాం

ఎకోటూరిజం మరింత అభివృద్ధి చేసేందుకు అనేక ప్రతిపాదనలు చేశాం. ఇక్కడ సేద తీరే పర్యాటకులు సముద్రానికి వెళ్లేందుకు ఒక వాహనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి, గ్రీనరీ డెవలప్‌మెంట్, మినీథియేటర్ సౌకర్యంతోపాటు కాటేజీలు పెంచే ఆలోచన చేస్తున్నాం. దీనికి సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే అన్నిరకాల వసతులతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన మరిన్ని కాటేజీలు అందుబాటులోకి తెస్తాం.

- ఎ.గీతిక, ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డివిజన్ మేనేజర్


ఎకో టూరిజంలోని కాటేజీలు


ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ఫంక్షన్‌గ్రౌండ్


కాటేజీల ఎదుట ఆహ్లాదకరమైన ప్రాంతం

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది...




ఆకాశం ఎరుపెక్కింది. గురువారం సాయంత్రం వేళ తెనాలిలో కనిపించిన దృశ్యమిది. బుర్రిపాలెం రోడ్డులో సాయంత్ర వేళ వాకింగ్‌కు వెళ్లే వారికి కనిపించిన ఈ దృశ్యం ఆకట్టుకుంది. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

- తెనాలి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

ప్రాణాలతో చెలగాటం!

అది ఎప్పుడో మూసి వేసిన రైల్వే గేటు... అయినా అక్కడ నుంచి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు... గేటుకు ఇరువైపులా గోడకట్టి రైల్వేశాఖ మూసి వేసినా దాన్ని ధ్వంసం చేసి మరీ రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు ఒక్కోసారి ఇక్కడ ఉన్న గూడ్స్ రైలు కింద నుంచి దూరి వెళ్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. స్థానిక బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు వద్ద నిత్యం ఇదో తంతుగా మారింది. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు ఖాళీ లేని సమయం, సిగ్నల్ ఇవ్వని సందర్భంలో బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు పాత రైల్వేగేటు వద్ద రైళ్లు, గూడ్స్ వ్యాగన్లు నిలిచిపోతాయి. ఆ సమయంలో అవి వెళ్లేదాక ఆగకుండా వాటి కింద నుంచి దూరి వెళ్తున్నారు. అంతేకాదు సైకిళ్లను కూడా తమ వెంట తీసుకెళ్తూ కొంతమంది విద్యార్థులు రైలు పట్టాలపై ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

- గుంటూరు(ఆంధ్రజ్యోతి)


గూడ్స్ రైలు కింద నుంచి సైకిల్‌తో సహా వెళ్తున్న విద్యార్థులు


గూడ్స్ రైలు కింద నుంచి వెళ్తున్న యువకులు


ఆగి ఉన్న గూడ్స్ ట్యాంకర్ మధ్య నుంచి వెళ్తున్న విద్యార్థి

ఎల్లవేళలా దయాక్షేత్రంపై ఏసయ్య కరుణ


భక్తి గీతాలు ఆలపిస్తున్న అబ్రహం, జాన్ వెస్లీ రమేష్, ఫైడిపాల్

● పాస్టర్ జాషువా మోజెస్
● లేమల్లెలో 48వ గుడారాల పండగ ప్రారంభం
● లక్షలాదిగా తరలివచ్చిన దైవజనులు, విశ్వాసులు


పండుగలో పాల్గొన్న సిస్టర్స్, విశ్వాసులు


హోసన్న గుడారాల పండుగను ప్రారంభిస్తున్న పాస్టర్ జాషువా మోజెస్, అబ్రహం, జాన్ వెస్లీ తదితరులు

అమరావతి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దయాక్షేత్రంలో గురువారం సాయంత్రం 48వ గుడారాల పండగ దైవజనుల, విశ్వాసుల సమక్షంలో ప్రభువు ఆశీస్సులతో ప్రారంభమైంది. పండగను దక్షిణ ఆఫ్రికాకు చెందిన పాస్టర్ జాషువా మోజెస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా దైవ సందేశాన్ని చదివి ఏసుక్రీస్తు ఆశీస్సులు, కరుణ దయాక్షేత్రం పండగలో పాల్గొన్న దైవజనులు, విశ్వాసులపై ఉండాలని ప్రార్థించారు. ప్రారంభ కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, రమేష్, ఫైడిపాల్, అనిల్, రాజుతో పాటు దైవజనులు పాల్గొని బెలూన్స్, పావురాళ్లను ఎగురవేశారు. అనంతరం దయాక్షేత్రం పుస్తకాన్ని అమెరికాకు చెందిన పాస్టర్ హెర్నిస్ట్ పాల్ ఆవిష్కరించారు. దయాక్షేత్రం పాటల సీడీని మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమాల ప్రారంభంలో హోసన్న జయమే.. జయం మనకే, ఏసయ్య నా ప్రాణమే.. అనే గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు ఏసయ్యకు స్తోత్రాలు పలుకుతూ భక్తి సాగరంలో మునిగారు. ప్రారంభ కార్యక్రమానికి ముందు అబ్రహం మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ దేవుని కరుణ ఉండాలని అన్నారు. పండగ జరిగే 4 రోజులు పక్కనున్న విశ్వాసుల కన్నా దేవునితో మాట్లాడుతూ ఉండాలని అన్నారు. పాస్టర్ జాషువా మోజేస్ మాట్లాడుతూ దయాక్షేత్రంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేతులు ఆకాశం వైపు చూపిస్తున్నాయని ప్రభువ ఆశీస్సులు వారిపై ఉండాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దేశ విదేశాల నుంచి దైవజనులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు సమీప రాష్ట్రాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు. ప్రారంభం రోజునే లక్షలాది మంది ప్రార్థనలో పాల్గొన్నారు. శుక్ర, శని వారాలలో ఉదయం, సాయంత్రం, ఆదివారం మధ్యాహ్నం జరిగే ప్రార్థనలతో పండగ ముగుస్తుంది.

సహకారం.. సాంకేతికం

(7వ పేజీ తరువాయి)

వీలుంటుందనేది ప్రభుత్వ ఆలోచన. మరోవైపు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా లక్షన్నర ఖాతాలు ఆన్‌లైన్ కాగా వీటికి సంబంధించి వేల ఖాతాల్లో అక్రమాలు బయటపడినట్లు సమాచారం. వీటిపై చర్యల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు.

వాణిజ్యం.. సహకారం

ఇప్పటి వరకు సహకార సంఘాల పాత్ర రైతులకు పంట రుణాలు అందించడంతో పాటు అరకొరగా ధాన్యం సేకరణకు మాత్రమే పరిమితమయ్యేది. అంతంతమాత్రంగా ఉన్న సొసైటీల ఆర్థిక పరిస్థితి గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో పూర్తిగా గందరగోళంలో పడిపోయింది. ఈ క్రమంలో వాటిని తిరిగి పట్టాలెక్కించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. తొలుత పీఏసీఎస్‌ల డిజిటలైజేషన్ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం మలిదశలో వాటిని వాణిజ్యం వైపు నడిపించడానికి బృహత్తర ప్రణాళికలను తయారు చేసే విధంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని డీసీసీబీ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సొసైటీలు చేయాల్సిన వ్యాపారాలను గుర్తించడంతో పాటు ఆసక్తి ఉన్న వారికి రుణాల మంజూరు ప్రక్రియను చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా పెట్రోలు బంకులు, ఎరువుల వ్యాపారం, గోడౌన్ల నిర్మాణం, విలువ ఆధారిత ఉత్పత్తులు, కల్యాణ మండపాలు, బియ్యం తదితర వ్యాపారాలను గుర్తించి ఆ దిశగా పీఏసీఎస్‌లను మళ్లించడానికి అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుంది. ఇప్పటి వరకు పంట రుణాలపై వచ్చే కమీషన్లపైనే సంఘాలు ఆధారపడేవి. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా రుణాలపై నామమాత్రపు వడ్డీతో పాటు కొన్ని వ్యాపారాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పీఏసీఎస్‌ల ఆదాయం పెరగనుంది. తద్వారా సొసైటీలకు వచ్చే ఆదాయాన్ని తిరిగి రైతుల మేలు కోసం మరింతగా ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. తద్వారా సహకార రంగాన్నే బలోపేతం చేసినట్లవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ చర్యలతోపాటు త్వరలోనే ఎన్నికలు జరిపి పాలకవర్గాలను కొలువదీర్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

మోతడకలో రెండు గంటలపాటు ట్రాఫిక్ జామ్

తాడికొండ (మోతడక) మార్చి 6(ఆంధ్రజ్యోతి): లేమల్లే గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్తున్న వాహనదారులు రెండు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. గురువారం నుంచి పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామంలో నిర్వహిస్తున్న గుడారాల పండగ ప్రార్థనలకు భారీగా భక్తులు చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఇతర జిల్లాల నుంచి భారీగా భక్తులు వాహనాల్లో తరలి రావటంతో తాడికొండ మండలం మోతడక గ్రామంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుడారాల పండగ ప్రార్థనలకు వెళ్లే భక్తులకు ప్రధాన రహదారి అమరావతి రోడ్డు కావటంతో భారీగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రెండు గంటలకు పైగా వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయటానికి పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనదారులే ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసుకున్నారు. తాడికొండ సీఐ వాసును వివరణ కోరగా పక్క జిల్లాల్లో జరుగుతున్న గుడారాల పండగ ప్రార్థనలకు బందోబస్తు నిర్వహించటానికి తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, ట్రాఫిక్ జామ్ విషయం తెలిసి ఎస్.ఐను సిబ్బందిని పంపించామని పేర్కొన్నారు.


మోతడకలో ట్రాఫిక్ జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

చిలకలూరిపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు గురువారం కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల, రైతు సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ కొల్లా మాట్లాడుతూ గత సంవత్సరం పొగాకు పంట ధరలు బాగా ఉండటంతో రైతులు విస్తారంగా బర్లీ పొగాకు సాగుచేశారని, ధరలేకపోవడంతో రైతులు నిండా మునిగిపోయారన్నారు. ప్రస్తుతం బర్లీ పొగాకును సరిగా కొనటం లేదన్నారు. గత సంవత్సరం మొదటి విరుపు అడుగు ఆకు కొట్టిన తర్వాత అమ్మితే క్వింటాకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర లభించిందని, ఈ ఏడాది రూ.4, 5వేలకే ధర పరిమితమైందన్నారు. గత సంవత్సరం రెండో వలుపు, మూడో వలుపు పొగాకును రూ.15వేల నుంచి రూ.18వేలకు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది రూ.10వేలకు కూడా కొనే నాధుడు కరువయ్యాడన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌సీవీ వర్జీనియా పొగాకు ధరలను, విస్తీర్ణాన్ని పొగాకు బోర్డు నియంత్రిస్తుందని, అలాగే పొగాకు బోర్డు జోక్యం చేసుకొని బర్లీ పొగాకు పంట ధర పడిపోకుండా చూడాలని సూచించారు. కంపెనీల చేత మద్దతు ధరకు బర్లీ పొగాకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పొగాకు రైతుల తరఫున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ, రావు సుబ్రమణ్యం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, షేక్ గౌస్, రైతు సంఘం నాయకులు కోలా నవజ్యోతి, చంద్ర కొండలరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.కోటేశ్వరరావు, కారుచోల స్వప్నకుమార్, ఉప్పాలబాబు, ఆర్ నర్సిరెడ్డి, ఇంటూరి భవాని వెంకటేష్, రైతు సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాగరమాత మహోత్సవాలు

మాచర్ల రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో కృష్ణానది తీరాన ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం సాగరమాత ఆలయ మహోత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భారతీయ సంప్రదాయాలతో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా సాగరమాత ఆలయం పేరుగాంచింది. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు, మొక్కుబడులు చెల్లించుకునే కార్యక్రమాలన్నీ పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయమిది. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం షామియానాలు, టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే భారీ జెయింట్ వీల్స్‌తో పలు స్టాల్స్ ఏర్పాటయ్యాయి.


ప్రాంగణంలో ఏర్పాటుచేసిన జెయింట్‌వీల్, స్టాల్స్


సాగరమాత ఆలయం

పశ్చిమ డెల్టాకాల్వకు 1016 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 90, తూర్పు కాల్వకు 118, పశ్చిమకాల్వకు 75, నిజాంపట్నంకాల్వకు 54, కొమ్మమూరుకాల్వకు 588 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 139 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,100, గరిష్ఠధర రూ.9,500, మోడల్‌ధర రూ.9,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.8,100, గరిష్ఠధర రూ.9,500, మోడల్‌ధర రూ.9,500 పలికాయి.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తోనే క్రమశిక్షణ

పెదనందిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌తోనే విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం ఏడుకొండలు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆయా పాఠశాలలో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించేందుకు యూనిట్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ముద్దన శ్రీనివాసరావు, జాకబ్, హెచ్ఎం లక్ష్మీదుర్గ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆరోగ్య కేంద్రం పరిశీలన

పెదనందిపాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొప్పర్రులో ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం పరిశీలించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి గ్రామస్థులకు కల్పిస్తున్న వసతుల గురించి సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సీహెచ్‌వో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేవేంద్రపాడులో నిందితుడి అరెస్టు

దుగ్గిరాల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తన భార్యను హత్యచేసి, తానూ ఆత్మహత్యకు పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు. గతనెల 26వ తేదీన రేవేంద్రపాడుకు చెందిన బొక్కినాల సురేష్, భార్య శ్రావణిపై అనుమానంతో హత్య చేసి, సూసైడ్ నోట్ రాసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో, అదేగ్రామానికి చెందిన కూరపాటి నరేంద్రను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించడంతో అతనిని నరసరావుపేట జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికను గాయపర్చిన వీధి కుక్క

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో కుక్కలు యథేచ్ఛగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నారులు, మహిళలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రోడ్లపై పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా మంగళగిరి రత్నాలచెరువులో ఆరేళ్ల బాలిక ఇంట్లో నుంచి బయటకు రాగానే ఓ కుక్క ఆకస్మాత్తుగా దాడి చేసింది. బాలికను కరిచి తీవ్రంగా గాయపరిచింది. సమీపంలో ఉన్న ఇద్దరు మహిళలు అప్రమత్తమై కేకలు వేయడంతో ఆ కుక్క బాలికను వదిలి పారిపోయింది. గాయపడిన బాలికను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

దుగ్గిరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలకు చెందిన తుమ్మపూడి సాంబయ్య కనిపించడం లేదంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు. గ్రామానికి చెందిన సాంబయ్య గతేడాది ఆగస్టులో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, తెలిసిన వారిని ఆరా తీసినప్పటికీ ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ వర్సెస్ గ్రామ పంచాయతీ

- పంచాయతీ స్థలంలో షాపులు నిర్మించాలని నిర్ణయం
- బస్టాండ్‌కు అడ్డుగా షాపులు నిర్మించరాదు : డీఎం
- స్థలం హద్దుల విషయంలో వివాదం
- బడ్డీకొట్లు ఖాళీ చేయించిన పంచాయతీ సిబ్బంది


తాడికొండ బస్టాండ్‌లో ఆర్టీసీ, పంచాయతీ సిబ్బందికి మధ్య వాగ్వాదం

తాడికొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తాడికొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గ్రామ పంచాయతీ స్థలంలో షాపులు నిర్మించే విషయంలో ఆర్టీసీ వర్సెస్ గ్రామ పంచాయతీగా వివాదం నడుస్తుంది. గురువారం పంచాయతీ సిబ్బంది బస్టాండ్‌కు పక్కనే ఏర్పాటు చేసిన బడ్డీకొట్లను తొలగించింది. అంతేకాకుండా షాపులు నిర్మించడానికి స్థలాలను శుభ్రం చేయించడంతో పాటు, కొలతలు తీసుకున్నది. రెండు షాపులు నిర్మించడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ డిపో మేనేజర్ తన సిబ్బందిని తాడికొండకు పంపించారు. దీంతో పంచాయతీ అధికారులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. వివరాల్లోకి వెళితే తాడి కొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పార్కు స్థలంలోని కొంత స్థలాన్ని ఆర్టీసీ బస్టాండ్ నిర్మించడానికి సుమారు 20 సంవత్సరాల క్రితం కేటాయించారు. అయితే ప్రధాన రహదారిలోని ఆర్టీసీ బస్టాండ్‌కు పక్కనే ఉన్న పంచాయతీ స్థలంలో కొత్తగా రెండు షాపులు నిర్మించటానికి పంచాయతీ బోర్డు తీర్మానం చేసింది. దీనికి సంబంధించిన గ్రామ పంచాయతీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఆర్టీసీ స్థలంలో షాపులు నిర్మించరాదని ఆర్టీసీ సిబ్బంది పేర్కొన్నారు. పంచాయతీ స్థలంలో మాత్రమే షాపులు నిర్మించుకోవాలని, బస్టాండ్‌లోకి వచ్చే దారిలో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదన్నారు. బస్టాండ్‌లోకి వచ్చే దారి మధ్యలో నిర్మాణాలు చేపట్టకుండా స్లాబ్ వరకు వేస్తామని పంచాయతీ అధికారులు చెప్తున్నారు. దీనికి ఆర్టీసీ సిబ్బంది ఒప్పుకోవటం లేదు. దీంతో పంచాయతీ అధికారులు, ఆర్టీసీ అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి పంచాయతీనే స్థలం కేటాయించిందని, ఇప్పుడు ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలంలో షాపులు నిర్మించి పంచాయతీకి ఆదాయాన్ని చేకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే ఆర్టీసీ అధికారులు అంగీకరించకపోవడం విడ్డూరంగా ఉందని పంచాయతీ అధికారులు మాట్లాడుతున్నారు. ఆర్టీసీకి కేటాయించిన స్థలంలో నిర్మాణాలు ఏవిధంగా చేస్తారని ఆర్టీసీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. సదరు విషయంలో ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన అమెరికా ప్రతినిధుల బృందం


అమెరికా యూనివర్సిటీ బృంద సభ్యులను సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ ఎం కిషోర్‌బాబు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన వేయిన్ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ల బృందం గురువారం నాడు కేఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. మెకానికల్ ఇంజినీరింగ్ డీన్ నబిల్ చలోబ్, సివిల్ ఇంజినీరింగ్ డీన్ లీలా మోహన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్‌బాబు మాట్లాడుతూ ఈ బృందం కేఎల్‌యూలోని పరిశోధనా రంగంతో పాటు అధ్యాపకులు, విద్యార్థుల మేధోపరిజ్ఞానాన్ని మరింత విస్తృతం చేసుకున్నట్లయిందని తెలిపారు. పరిశోధనలలో అనేక అంశాల్లో వారికున్న ప్రావీణ్యం ఏమిటన్నది తెలుసుకోవడానికి ఈ చర్చలు సహకరించాయని తెలిపారు. వివిధ పరిశోధనాంశాల్లో కలిసి చేయగల పరిశోధనలకు పరస్పర సహకారానికై ఒప్పందానికి వచ్చినట్టు వారు తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా 2వ, 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అమెరికాలోని వేయిన్ స్టేట్ యూనివర్సిటీలో మిగిలిన విద్యను కొనసాగించవచ్చునని అన్నారు. అలాగే అక్కడి విద్యార్థులు కూడా భారత్‌కు వచ్చి ఇక్కడి విద్యను కొనసాగించవచ్చనని అన్నారు. రాబోయే సెమిస్టర్ నుంచి అమల్లోకి వచ్చేలా ఒప్పందపు నమూనా ప్రతిపై రెండు పక్షాలు అంగీకరించాయని డీన్ కిషోర్‌బాబు తెలిపారు. చర్చల అనంతరం అమెరికాలో విద్యనభ్యసించగోరు విద్యార్థులనుద్దేశించి అతిథుల బృందం ప్రసంగించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికాలో చదువుకోవడానికి కావాల్సిన ప్రణాళిక ఎలా ఉండాలో వారు మార్గ నిర్దేశం చేశారు. ఈ చర్చలలో కేఎల్‌యూ ఆర్‌అండ్‌డీ అదనపు డీన్ బీపీటీ మాధవ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి విజయ్‌కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పోలు రాజు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయమారుతి, అసోసియేట్ డైరెక్టర్ గోపి కృష్ణలు పాల్గొన్నారు.

నేడు, రేపు మలినేనిలో ఫెస్ట్

వట్టిచెరుకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 7, 8 తేదీల్లో సంస్కృతి, 2025 నేషనల్ లెవల్ టెక్నో కల్చర్ స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. శుక్రవారం ఉదయం నూతన అకడమిక్ హాస్టల్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ ఫౌండేషన్ స్టోన్ వేసేందుకు ముఖ్యఅతిథిగా విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సిన్హా, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వీ పద్మారావు, సినీ నటుడు రఘుబాబు, సినీ నటుడు, మాదల రవి, క్వాలిటీ ఎస్యూరెన్స్ అరవిందో ఫార్మా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వరరావు రానున్నారు. రాత్రికి మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్టు, ఈ కార్యక్రమంలో సింగర్ గీతామాధురి పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.

'ఇన్ఫోసిస్' నియామకాల్లో వీవీఐటీ విద్యార్థినుల సత్తా


ఉద్యోగ నియామకాలు పొందిన వీవీఐటీ విద్యార్థినులు

పెదకాకాని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ సేవల దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ నియామకాల కోసం ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విద్యార్థినులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపిక నందు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 88మంది విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచి ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. గ్రామీణ నేపథ్యం గల బాలికలు అధికంగా ఈ నియామకాలు పొందడం సంతోషం కలిగించిందని తెలిపారు. కృష్ణ గుంటూరు ప్రాంతీయ పరిధిలో వీవీఐటీ విద్యార్థులు అధిక నియామకాలు పొందటం విశేషం అని అన్నారు. నియామకాలు పొందిన విద్యార్థినులు 3.6 లక్షల నుంచి 9.5 లక్షల వార్షిక వేతనం సంస్థ కేటాయించినట్లు తెలిపారు. కళాశాలలోని ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని ఉద్యోగ నియామకాలు పొందేవిధంగా తొలి ఏడాది నుంచే పరిశ్రమ అవసరాలకు తగట్టు అత్యాధునిక సాంకేతిక అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం నియమకాలు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ప్లేస్మెంట్ ఎంవీ రఘురామ్, ఉపాధికల్పన, శిక్షణ విభాగాధిపతి మాధవ్ అభినందించారు.

కృష్ణాతీరంలో విజిబుల్ పోలీసింగ్

తాడేపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణాతీరంలో ఇసుక తిన్నెలపై సాయంత్రం దాటిన తరువాత మత్స్యకారులు తప్ప ఇతరులు ఉండరాదని సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు. సిబ్బందితో కలిసి గురువారం సీతానగరం నుంచి కనకదుర్గమ్మ వారధిల మధ్య నదీ ప్రాంతం వెంట విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. డ్రోన్ ద్వారా తీరం వెంబడి ఉన్న నిర్మానుష్య ప్రాంతాలను జల్లెడ పట్టారు. చీకటి పడే సమయంలో ఇసుక తిన్నెల వద్ద ఉన్న వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రైతుల భూములను పరిరక్షించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి 6(ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకునే భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక కొత్తపేటలోని దేవదాయశాఖ కార్యాలయంలో గురువారం జిల్లా దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆ భూములను అప్పటి మార్కెట్ ధర చెల్లించి కొనుగోలు చేశారని గుర్తుచేశారు. 2013లో వచ్చిన ఎండోమెంట్ చట్టం ప్రకారం వారి భూములను ఎండోమెంట్ పరిధిలోకి వస్తుందని ఆన్‌లైన్‌లో ఎక్కించారని, దీంతో బ్యాంకు అధికారులు రుణ సౌకర్యాన్ని నిలిపివేశారని అన్నారు. ప్రభుత్వం స్పందించి భూముల్ని ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పచ్చల శివాజీ, కొల్లి రంగారెడ్డి, పి.జగన్నాథం కంజుల విఠల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ఎలైన్‌మెంట్ మార్చాలని సీఆర్‌డీఏ అధికారులకు వినతి


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఉస్మాన్, భక్తులు

మంగళగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నవులూరులో నూతనంగా నిర్మించనున్న రోడ్డుకు సంబంధించి ఎలైన్‌మెంట్‌లో మార్పు చేయాలని కోరుతూ హజరత్ మాలక్ హుస్సేన్ అవులియా బాబా దర్గా ప్రతినిధులు, భక్తులు గురువారం సీఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దర్గా ట్రస్టీ మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దర్గా మధ్య వరకు సీఆర్‌డీఏ అధికారులు మార్కింగ్ ఇచ్చారని చెప్పారు. హిందూ, ముస్లింలు భేదాభిప్రాయాలు లేకుండా బాబా వారిని పూజించి, దర్గా ఆవరణలోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తారని తెలిపారు. ఇప్పుడు రోడ్డు కోసం అధికారులు మార్కింగ్ వేయడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో కాలేషా మస్తాన్‌వలి దర్గా, విజయవాడలో హుస్సేన్ షా ఖాదరి దర్గాలకు కూడా గతంలో మార్కింగ్ ఇచ్చి భక్తుల మనోభావాల దృష్ట్యా రోడ్డు ఎలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని గుర్తుచేశారు. తమ విజ్ఞప్తిపై అధికారులు స్పందించి దర్గా మధ్యలో మార్కింగ్ చేసిన హద్దు నుంచి దక్షిణం వైపు 15 అడుగుల దూరం వరకు మార్కింగ్ జరిపి దర్గాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వడ్డేశ్వరంలో కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న దాత కాట్రగడ్డ మధుసూదనరావు తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని ఎంహెచ్‌ఆర్ నగర్ నందు కమ్యూనిటి గ్రౌండ్‌కు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ టీడీపీ సీనియర్ నేత, దాత కాట్రగడ్డ మధుసూదనరావు కాంపౌండ్ వాల్, మెరక తోలేందుకు రూ.లక్ష 50వేల ఎస్టిమేషన్‌తో గతంలో హామీ ఇచ్చారు. హామీ మేరకు గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని దాత మధుసూదనరావు చేతుల మీదుగా పూర్తి చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, షేక్ బాబు, దామోదరరావు, కోటేశ్వరరావు, కుమార్ విక్టర్‌సాయి, బాబూరావు, భీముడు, మంగమ్మ, రూతు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో సమావేశ మందిరానికి భూమిపూజ

● పూర్వ విద్యార్థుల ఆర్థికసాయంతో నిర్మాణం

వట్టిచెరుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడు గ్రామంలోని బొమ్మిడాల కోటిరత్నం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో రెండు గదులు సమావేశ మందిర నిర్మాణానికి గురువారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయులు త్రిపురనేని సాంబశివరావు సతీమణి లక్ష్మీ కాంతమ్మల కుమారులు, ఎన్ఆర్ఐలు, ప్రముఖ వైద్యులు త్రిపురనేని ప్రభాకరరావు, రవికుమార్, భాస్కర రావుల దాతృత్వంతో రెండు గదులు సమావేశ మందిర నిర్మాణానికి దాతల తల్లి లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో మానం సుబోస్ చంద్రబోస్‌రెడ్డిల దంపతులతో గురువారం గ్రామస్థులు, విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ జడ్పీటీసీ తాటి వీరయ్య, సర్పంచ్ భవనం సుబ్బారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ హేమ సుందరమ్మ, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ ట్రస్ట్, అడపా మురళీధరరావు, ఎంఈవో నిర్మల, ప్రధానోపాధ్యాయులు జీబీవీ వెంకటరావు, ఉపాధ్యాయులు మానం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరవిందలో ఆకట్టుకున్న అకడమిక్ డెమో

మంగళగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నిడమర్రు రోడ్డులోని అరవింద పాఠశాలలో గురువారం అకడమిక్ డెమో నిర్వహించారు. ఏడాది కాలంలో నేర్చుకున్న విద్యాపరమైన అంశాలను డెమోలో ప్రదర్శించారు. తరగతి గదుల్లో తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరవింద పాఠశాల డైరెక్టర్ బి.ఇంద్రాణి, ప్రిన్సిపాల్ సాయి అరవింద్, ప్రైమరీ ఇన్‌చార్జి వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తుల సహకారంతో శ్రీవారికి కల్యాణ మండపం


అనంతవరం కొండ దిగువన నిర్మించిన కల్యాణ మండపం

తుళ్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతవరం కొండ మీద ఉన్న వెంకటేశ్వర స్వామికి దిగువన భక్తులు వేజళ్ల సందీప్, బుడ్డి గణేష్‌లు కల్యాణ మండపం నిర్మించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలో స్వామికి కల్యాణ మండపం సమకూర్చటం సంతోషంగా ఉందని గ్రామస్థులు, భక్తులు టీడీపీ అనంతవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బండ్ల సూరిబాబు అన్నారు. గురువారం శాస్త్రోక్తంగా పూజలు హోమాలు, స్వామికి కల్యాణం నిర్వహించి టీటీడీ వారికి కల్యాణ మండపం స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రజక కమ్యూనిటి హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

తాడేపల్లి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 17వ వార్డులో రజక దోబీఖానా స్థలంలో నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావు, గౌరవాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలే మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రాలు సమర్పించగా ఆగిన కమ్యూనిటి హాల్ నిర్మాణాన్ని పరిశీలించేందుకు అలీం బాష, అరుణ్‌బాబు వచ్చారు. వెంటనే కమ్యూనిటి హాల్ నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేయగా అధికారులు స్పందించి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్

దుగ్గిరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించడంతో పాటు, పాఠశాలల బలోపేతానికై యిచ్చే సలహాలు, సూచనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీపీవో సాయికుమార్ అన్నారు. గతప్రభుత్వం ఇచ్చిన 117 జీవోను ఉపాధ్యాయులు, పలువురు తల్లిదండ్రులు వ్యతిరేకిస్తూ వస్తున్న నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీలతో గురువారం సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి వరకూ ప్రస్తుతమున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగించేందుకు ఐదోతరగతి వరకు కనీసం 21 నుంచి 60 మంది విద్యార్థులుండాలన్నారు. ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలల్లో 31మంది పిల్లలుంటే ఇద్దరు టీచర్ల నియమిస్తారన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్లో 1 నుంచి 5వ తరగతి వరకూ 60కిపైగా విద్యార్థులుండాలని, ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తారని వివరించారు. తరగతులను తరలించేందుకు 15 పాఠశాలల ఎస్ఎంసీ ఛైర్మన్‌లు తమ పాఠశాలల విలీనాన్ని వ్యతిరేకించారు. తమ పిల్లలు చదివే పాఠశాలల్లో తరగతులను యథాతథంగా కొనసాగించాలన్నారు. ఎంఈవో కాజ లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాలలో నేటి నుంచి టెక్నికల్ ఫెస్ట్

మేడికొండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం విశదల అడ్డరోడ్డులోని ఎన్నారై కళాశాలలో సరితం(టెక్నో, స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్) 2కె25 టెక్నో ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమవుతుందని ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటులు మంచు మనోజ్, కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త కే శరత్ హాజరు కానున్నారు. సరితం 2కె25 టెక్నో ఫెస్ట్ పేరుతో రెండు రోజుల పాటు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ టెక్నికల్ ఫెస్ట్‌కు అందరిని ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు వివరించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు సహకరించాలి

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా హెచ్చరించారు. మంగళగిరి, తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. 54 కిలోల ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్న దుకాణ యాజమానులకు రూ.12,900 జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి నుంచి మార్కెట్‌కు వచ్చేముందు తమతోపాటు పేపర్, జూట్‌తో తయారు చేసిన బ్యాగులను తెచ్చుకోవాలని సూచించారు. మంగళగిరిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

8న ఉప్పుటూరి చిన రాములు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

వట్టిచెరుకూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంటకి చెందిన ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి తన తండ్రి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఉప్పుటూరి చినరాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 8న తేదీన పుల్లడిగుంటలోని స్థానిక వీరాంజనేయ స్వామి కల్యాణ మండపంలో వట్టిచెరుకూరు, పత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు మండలాలకు సంబంధించి 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బూర్ల రామాంజనేయులు, విద్యాశాఖ అధికారి సీవీ రేణుకలు ఉప్పుటూరి చిన రాములు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే అదే రోజు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

23న మాజీ సైనిక సంక్షేమ సంఘం ఎన్నికలు

మంగళగిరి సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం నూత న కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరుగుతాయని సంఘం రాష్ట్ర అడహక్ కమిటీ కోఆర్డినేటర్ కే.గోవిందరావు తెలిపారు. మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాజీ సైనికుల సం క్షేమం కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో మంగళగిరి వెటరన్స్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సాంబ శివరావు, ప్రధాన కార్యదర్శి పీ బాలస్వామి, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సదస్సును జయప్రదం చేయాలి

మంగళగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భం గా ఈ నెల 9వ తేదీన మంగళగిరి ఆర్ఆర్ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర అధ్యక్షురాలిగా సంకారపు జయశ్రీ నియామకతోపాటు రాష్ట్ర మహిళా సంఘాల కార్యవర్గ నిర్మాణం జరుగుతుందన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు, అధికారు లు హాజరవుతారని, మహిళలు పెద్ద సంఖ్య లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు మండల పరిషత్ కార్యాలయంలో మహిళా దినోత్సవం

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమాలకు సబ్ కలెక్టర్ సంజనాసింహ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమెతో పాటు మండలంలోని పలువురు మహిళా అధికారులు విచ్చేస్తారన్నారు. మండల పరిషత్ కార్యాలయ పరిధిలోని సచివాలయ, అంగన్‌వాడీ, ఇతర శాఖల మహిళా ఉద్యోగులతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలు కూడా విచ్చేయనున్నట్లు వివరించారు. మహిళా ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

15లోపు పన్ను బకాయిలు చెల్లించాలి: కమిషనర్

పొన్నూరు టౌన్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): మార్చి 15వ తేదీలోగా ఆస్తి పన్నుల బకాయిలు చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ ముపాళ్ల రమేష్‌బాబు గురువారం తెలిపారు. పొన్నూరు పురపాలక సంఘానికి దీర్ఘకాలికంగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారు తక్షణమే బకాయిలు చెల్లించకపోతే ఆస్తులను స్వాధీనం చేసుకోనున్నట్లు హెచ్చరించారు. బకాయిదారుల జాబితాలను బహిరంగ ప్రదేశాల్లో ప్రచురిస్తామన్నారు. బకాయిదారులకు కేవలం 15వ తేదీలోపు మాత్రమే గడువు విధించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ బకాయిదారులు స్పందించకపోవడం సరికాదన్నారు. పురపాలక సంఘ ఉద్యోగులు బకాయిదారుల వద్దకు వెళ్లి పన్నులు వసూళ్లకు వచ్చినప్పుడు సహకరించాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎటువంటి వడ్డీ మాఫీ లేదని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున శెలవు రోజుల్లో కూడా మునిసిపల్ కార్యాలయం, పట్టణంలోని 17సచివాలయాల ద్వారా పన్నులు చెల్లించవచ్చునని సూచించారు. ఆన్‌లైన్, చెక్కులు, డీడీల రూపంలో కూడా పన్నులు చెల్లించవచ్చునని కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

పవన్ కల్యాణ్‌ను దూషిస్తే సహించేది లేదు: చందు శ్రీరాములు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తే సహించబోయేదిలేదని జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు హెచ్చరించారు. చేబ్రోలులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు జగన్‌రెడ్డి రాష్ట్రానికి అతిథిలా వచ్చి వెళుతున్నారని ఎద్దేవా చేశారు. నిద్రలేచినప్పుడల్లా బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చి వెళ్లే జగన్ పవన్‌కల్యాణ్ గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని మాట్లాడుతున్న జగన్‌రెడ్డిని ప్రజలు ప్రతిపక్ష హోదాకూడా దక్కనీయకుండా ఓడించారనే విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. ఇలాగే వ్యవహరిస్తే ఉన్న 11స్థానాలు కూడా కోల్పోవలసి వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన అనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. మరోసారి, అధినేతపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే జనసేన నాయకులు, కార్యకర్తలు తమరీతిలో బుద్ధి చెబుతారని శ్రీరాములు హెచ్చరించారు.

నేటి నుంచి గోవర్ధనస్వామి ఆలయంలో ధ్వజ ప్రతిష్ఠ పూజలు

తెనాలి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీచౌక్‌లోని గోవర్ధనస్వామి ఆలయంలో ధ్వజ ప్రతిష్ఠ కుంభాభిషేకం కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. కార్యక్రమ కరపత్రాలను అర్చక సిబ్బంది గురువారం విడుదల చేశారు. రుక్మిణి సత్యభామా సమేత గోవర్ధనస్వామి, వీరప్రతాప ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సహకారంతో ముఖ మండపం నిర్మించారు. ఈ సందర్భంగా జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం తలపెట్టారు. నాలుగు రోజుల పాటు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు ఈ ఆలయాన్ని సందర్శించిన శాసనం ఇక్కడ ఉంది. 7న అంకురార్పణ, 8న అగ్ని ప్రతిష్ఠాపన, గోవర్ధనస్వామి, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్ల కలశ స్థాపన, హోమాలు, 9న ధ్వజ శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం, 10న శాంతి కల్యాణం, అన్నదానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్త నిఖిల్ శాండిల్య, అర్చకులు అనంతాచార్యులు, కేశవమూర్తి, యశ్వంత్ తదితరులు కోరారు.

నేడు మధురకవి నూతక్కి అబ్రహం 102 జయంతి సభ

తెనాలి రూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మధురకవి నూతక్కి అబ్రహం 102వ జయంతి సభను శుక్రవారం కొలకలూరులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని కొలకలూరు బాబుజగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్లో గురువారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు కొలకలూరులోని బాబూజగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్లో మధురకవి నూతక్కి అబ్రహం జయంతి వేడుకలు డాక్టర్ పి.జోసెఫ్‌రత్నాకర్ అధ్యక్షతన ప్రారంభమవుతాయన్నారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ భూసరపల్లి వెంకటేశ్వర్లు, రంగస్థల నటులు పుష్పరాజ్, కవి నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి పలువురు సాహితీ ప్రియులు పాల్గొంటారన్నారు. సభను విజయవంతం చేయాలని నిర్వాహక సభ్యులు కోరారు. కార్యక్రమంలో యడ్లపల్లి రవికిరణ్, ఎస్.మురళీధర్, గురుదేవ్, జాన్ బాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంచనమాల పుస్తకావిష్కరణ

తెనాలి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి కాంచనమాల పుస్తకావిష్కరణ శుక్రవారం గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో జరగనుంది. పారా అశోక్‌కుమార్ రచించిన ఈ పుస్తకాన్ని సీనియర్ వైద్యుడు పాటిబండ్ల దక్షిణామూర్తి ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆహ్లాదం ఆవిరి

- పొన్నూరు పట్టణంలో కనుమరుగవుతున్న పార్కులు
- మట్టి, చెత్త కుప్పలతో దర్శనమిస్తున్న ఉద్యాన వనాలు
- 60వేలు పైబడి ఉన్న పట్టణ జనాభా
- ఆటవిడుపుకు అవకాశాలు ఏవి?



తుప్పలు, మట్టి కుప్పల నడుమ శిథిలావస్థలో ఉన్న ఆట వస్తువులు



శాంతినగర్ పార్క్‌లో ఉన్న మట్టికుప్పలు

పొన్నూరు టౌన్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో చిన్నారులు, వృద్ధులు ఆటవిడుపునకు, ఆహ్లాదం కోసం పార్కులు లేని పరిస్థితి ఏర్పడింది. పొన్నూరు పట్టణంలో 60వేల పైబడి జనాభా ఉన్నప్పటికీ ప్రజలు సేదదీరేందుకు ఉద్యాన వనాలు లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. గతంలో ఏర్పాటుచేసిన పార్కులు కూడా ఐదేళ్ల కాలంలో గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమయ్యాయి. పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో నిర్వహణ లోపంతో చెత్తకుప్పలుగా మారాయి. గత పాలకుల బాధ్యతారాహిత్యం కారణంగా ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన పచ్చదనం క్రమేణా కనుమరుగైపోయింది. ఆటలాడుకోడానికి పార్కులకు వెళ్లే చిన్నారులకు, సేద తీరేందుకు వెళ్లే వృద్ధులు, ప్రజలకు ఖాళీ పార్కులు దుర్గంధభరిత వాతావరణం ఎదరవతోంది. పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, శాంతినగర్, నిడుబ్రోలు వంటి ప్రాంతాల్లో దశాబ్దకాల క్రితం ప్రజలు సేదతీరేందుకు అప్పటి పాలకులు పార్కులు ఏర్పాటుచేశారు. చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు పలు ఆట వస్తువులు, వ్యాయామ ఉపకరణాలను సైతం ఏర్పాటుచేసి పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటారు. అయితే ఐదేళ్లుగా పార్కుల నిర్వహణ గత పాలకులు దృష్టిసారించకపోవడంతో పార్కులు చెత్తాచెదారాలు, మట్టికుప్పలతో నిండిపోయాయి. మొక్కలు, గ్రీనరీని ల్యాండ్ స్కేపింగ్ చేయకపోవడంతో పచ్చదనం పూర్తిగా కనుమరుగైంది. పార్కుల్లోని వ్యాయామ ఉపకరణాలు, బెంచీలు, పిల్లల ఆట వస్తువులు పూర్తిగా దెబ్బతినిపోయాయి. ఫలితంగా పట్టణవాసులకు ఆహ్లాదం పూర్తిగా కనుమరుగైపోయింది. వేసవిలో గతంలో పార్కులకు వెళ్లి సేదతీరే ప్రజలు నేడు ఆ సౌలభ్యం లేక ఇంటికే పరిమితమైపోతున్నారు. కేవలం నిర్వాహణ లోపంతో పార్కులకు ఈ దుస్థితి పట్టిందని పట్టణ వాసుల్లో ఆవేదన ఉంది.

ప్రతిపాదనలకే పరిమితమైన సీఆర్‌డీఏ పార్క్

పొన్నూరు పట్టణ వాసులకు సేదతీరేందుకు ఆహ్లాదం పంచేందుకు 2014-19 మధ్య కాలంలో నిడుబ్రోలులో భారీ పార్కు ఏర్పాటు చేయాలని అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సంకల్పించారు. నిడుబ్రోలులోని 100 ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, టిడ్కో గృహ సముదాయాల చెంతనే ఖాళీగా ఉన్న భూమిలో పార్కు ఏర్పాటు చేయాలని క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీని సంప్రదించడమే కాకుండా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించారు. ఇందుకోసం సీఆర్‌డీఏ రెండు కోట్ల వ్యయంతో పార్కు నిర్మాణానికి ముందుకు వచ్చింది. 2019 ఎన్నికల్లో అప్పటి పాలకులు ఓటమి చెందడంతో ఈ పార్కు నిర్మాణం ముందుకు సాగలేదు. వైసీపీ పాలకులు మంజూరైన నిధులను కూడా పట్టించుకోకపోవడంతో పార్కు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అయితే అమృత్ పథకంలో భాగంగా పార్కుల నిర్మాణ వెసులుబాటు ఉన్నప్పటికీ గత పాలకులు ఆ వైపు దృష్టిసారించలేదు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పొన్నూరు పట్టణంలో గతంలో ప్రతిపాదించిన విధంగా పార్కు నిర్మాణానికి కృషిచేయాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. పొన్నూరు వాసులకు దూరమైన ఆహ్లాదాన్ని తిరిగి ప్రజల చెంతకు చేర్చాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలి

సబ్ కలెక్టర్‌కు రైతుల బృందం వినతి



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

తెనాలి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో నష్టపోయిన పసుపు రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని పసుపు రైతులు సబ్ కలెక్టర్ సంజన సింహాను కోరారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైతుల బృందం సబ్ కలెక్టర్‌ను కలిసి వివరించారు. 380 మంది పసుపు రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. సాయం త్వరితగతిన అందేలా చూడాలని కోరారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, వేములపల్లి వెంకట్రామయ్య, కోటేశ్వరరావు, శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.



ధ్వజ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

పొన్నూరు టౌన్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కసుకర్రులో శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శిథిలమైన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజ స్తంభాన్ని గ్రామస్థుల సహకారంతో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రతిష్ఠ అనంతరం శాంతిహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రీ సర్వేను పారదర్శకంగా చేపడదాం

- తహసీల్దార్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో నిర్వహించనున్న రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేసి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్నతో కలిసి తహసీల్దార్ గోపాలకృష్ణ వార్డు రెవెన్యూ, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ఇతర అధికారులతో పట్టణంలో చేపట్టబోతున్న ఎన్‌పీఐ హౌసింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు కార్డుకు పేర్లు నమోదు చేసుకోవాలి: ఏడీఏ ఉషారాణి

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సొంతభూమి కలిగిన రైతులందరూ రైతు కార్డు పొందేందుకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఉషారాణి చెప్పారు. గురువారం ఏవో ప్రేమసాగర్‌తో కలిసి మండలంలోని తేలప్రోలులో రైతులతో ఆమె సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీజనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొల్లిపరలో శ్రీజనార్థనస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కొల్లిపర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధన స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పండితులు పూజలు నిర్వహిస్తున్నారు. పండితులు జగన్నాథాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృథ్వీబార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మ స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన, పుణ్యాహవచన వంటి పూజలు చేసిన అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు మంత్రపుష్పంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇన్ఫోసిస్‌లో వీవీఐటీ విద్యార్థినులకు ఉద్యోగాలు

పెదకాకాని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రాంగణ ఎంపికల్లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనినిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 88మంది బాలికలు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగ నియామకాలు పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్, ఏపీ ఇన్స్పైరేషన్ టెక్నాలజీ అకాడమీతో కలసి ఇంజనీరింగ్ విద్యార్థినులకు ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంలో కమిషనర్ శేషన్న క్యాంటీన్ సిబ్బందిని క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. క్యాంటీన్‌లో పేదలకు అందించే ఆహారం నాణ్యత ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు. ఆహారాన్ని స్వీకరిస్తున్న పలువురిని ప్రశ్నించి రుచిగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెంచుపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూత్రశాలపై కుంగిన పైకప్పు



తహసీల్దార్ కార్యాలయం వద్ద కుంగిన పైకప్పుతో ఉన్న మూత్రశాల

తెనాలి అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారి వెంట నిర్మించి మూత్రశాలపై కప్పు కుంగిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. రేకుల కింద వేసిన ఇనుప పైపు తుప్పు పట్టి సగానికి విరిగిపోయింది. మూత్రశాలను వినియోగించే వారిపై పడే అవకాశం ఉంది. వాటర్‌లెస్ యూరినల్ ఇక్కడ ఏర్పాటు చేయడంతో పలు కార్యాలయాలకు వచ్చే వారు దీనిని వినియోగిస్తున్నారు. వాటర్‌లెస్ విధానం పనిచేయకపోవడం, కాల్వలో మురుగుపారుదల లేకపోవడంతో దుర్వాసనతో అటుగా వెళ్లే వారంతా ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది.

వేసవిలో జాగ్రత్తలు వహించండి

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హరిణి





తెనాలి, మారీసుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మార్చి ప్రారంభం నుంచే ఎండ వేడి పెరిగింది, దీంతో డీహైడ్రేట్ అయ్యే అవకాశం ఉందని జాగ్రత్త వహించాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హరిణి గురువారం అన్నారు. వేసవిలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతితో తెలిపిన వివరాలు.

● డీహైడ్రేట్ అవడం అంటే ఏమిటి?

డా.హరిణి: మానవ శరీరం అధిక శాతం నీటితో నిక్షిప్తమై ఉంటుంది. వేసవిలో ఎండ వేడికి శరీరంలోని నీటిశాతం పూర్తిగా తగ్గిపోవడాన్ని డీహైడ్రేట్ అవ్వటం అని అంటారు.

● దీని వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయి ?

డా.హరిణి: వడ దెబ్బ తగలడం, తీవ్రజ్వరం, అలసట, స్పృహ కోల్పోవడం, నీళ్ల విరోచనాల భారిన పడతారు.

● వడదెబ్బ తగిలితే ఏం చేయాలి ?

డా.హరిణి: వడ దెబ్బ తగిలిన వారిని ఎండ నుంచి నీడలోకి తీసుకువచ్చి గాలి ఆడేలా చర్యలు తీసుకోవాలి తాగునీరు, ఓఆర్‌ఎస్‌ను తాగించడం, పండ్ల రసాలను తాగించడం చేయాలి. స్పృహ కోల్పోతే దగ్గరలోని వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందించాలి.

● నివారణ చర్యలు ఏమి తీసుకోవాలి?

డా.హరిణి: పనులు ఏమైనా ఉంటే ఉదయం సాయంత్ర వేళలలో చేసుకోవాలి. ఎండ వేడికి దూరంగా ఉండటం తెల్లని దుస్తులు ధరించడం, రోజుకు 5 లీటర్లకు తక్కువ కాకుండా నీరు తీసుకోవడం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తాజా పళ్ల రసాలు తీసుకోవటం చేస్తే వేసవిలో ఆరోగ్యంగా జీవించవచ్చు.



భూమి పూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

29నుంచి తెనాలిలో ఎడ్ల బలప్రదర్శన

- వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాట్లకు భూమి పూజ

తెనాలి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వ వరకూ తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎడ్ల బల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ చెప్పారు. గురువారం ఎడ్ల బల ప్రదర్శన జరిపే వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో పార్టీ నాయకులతో కలిసి వేదపండితులతో శాస్త్రయుక్తంగా భూమిపూజ కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ గత 9ఏళ్ల నుంచి ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎడ్ల బలప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రైతులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనే ఎడ్ల బలప్రదర్శనను తిరిగి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో జరిగే ఎడ్ల బలప్రదర్శనలో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మంగమూరి హరిప్రసాద్, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, రావి చిన్ని, సుంకరహరికృష్ణ, కనగాల శ్రీనివాస్, పరుచూరి రమ్యకొండా రమాదేవి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

కొల్లిపర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈవో సాల్మన్‌రాజు గురువారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో విద్యను బోధించాలన్నారు. ప్రతినెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల పురోగతిని వారికి తెలియజేయడం మంచిదన్నారు. మధ్యాన్న భోజన పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.